ఉష్ణోగ్రత గురువారం గరిష్ఠం : 31.0 కనిష్ఠం : 21.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5


శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

శుక్రవారం 31 అక్టోబరు 2025



రేపు పెద్దన్నవారిపల్లికి ముఖ్యమంత్రి చంద్రబాబు





పెద్దన్నవారి పల్లి గ్రామంలో పర్యటిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీ

(6లో..)

సత్యసాయి శతజయంతి లోగో



శతజయంతి శోభ

పుట్టపర్తిలో చురుగ్గా ఏర్పాట్లు

● దేశవ్యాప్తంగా వీఐపీలకు ట్రస్టీల ఆహ్వానం ● ఆధ్యాత్మిక కేంద్రంలో మొదలైన సందడి

పుట్టపర్తి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంతి వేడుకలకు ఏర్పాట్లు ఊపందుకున్నాయి. సత్య సాయి సెంట్రల్ ట్రస్టుతో పాటు ప్రభుత్వం కూడా అభివృద్ధి పనులు వేగంగా చేస్తున్నాయి. ఈక్రమంలో ఇప్పటికే ప్రశాం తినిలయం విద్యాసంస్థలు, ఆసుపత్రుల భవనాలు ముస్తాబు చేశారు. రోడ్లకు స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. దేశ, విదేశాల నుంచి భారీగా హాజరయ్యే భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ట్రస్ట్ వర్గాలు తెలిపాయి. అలాగే సత్యసాయి శత జయంతి వేడుకల్లో పాల్గొనాలని సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులు దేశవ్యా ప్తంగా ఉన్న వీఐపీలను ఆహ్వానించడంలో నిమగ్నమ య్యారు. ఇప్పటికే ప్రధాని మోదీ, రాష్ట్ర గవర్నర్, ఉభయ తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రులు, కర్ణాటక ముఖ్యమంత్రిని ఉత్సవాలకు హాజరుకావాలని ప్రత్యేకంగా ఆహ్వానించారు.

భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు

ప్రశాంతి నిలయంలో భక్తుల సౌకర్యం కోసం ట్రస్ట్ ఆధ్వ ర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు తాత్కాలిక నివాసాలతో పాటు టాయిలెట్స్ ఏర్పాటు చేస్తున్నారు. అవి కాకుండా వెస్ట్ గేటుకు దగ్గరలో భారీ ఎత్తున షెడ్లను ఏర్పాటు చేశారు. ఇందులో భక్తులకు నారాయణ సేవను అందిచనున్నారు. గణేష్ సర్కిల్ ట్రస్టు స్థలంలో మరో భారీ షెడ్డును ఏర్పాటు చేశారు. ప్రశాంతి నిలయం నుంచి రైల్వే స్టేషన్ వరకు ప్రత్యేక స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు. సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, ప్రశాంతి నిలయం లోని భవనాలు, విద్యాసంస్థలకు రంగులు అద్దారు. విద్యుత్ దీపాలంకరణ చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఏర్పాట్లను ప్రతిరోజు పర్యవేక్షించి అధికారులకు సూచనలు చేస్తున్నారు. చిత్రావతి నది సమీప ప్రాంతాన్ని సుందరీకరించారు. ప్రధాన రోడ్లకు ఇరువైపులా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. తాగునీరు, పారిశుధ్యం పనులు మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మరమ్మతులు చేపట్టారు. అక్కడక్కడ సీసీ రోడ్లను వేస్తున్నారు.

సత్యసాయి జయంతికి మంత్రుల కమిటీ

పుట్టపర్తి టౌన్: సత్యసాయిబాబా శతజయంతి వేడుకల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం మంత్రుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల నిర్వహణ కమిటీ అధ్యక్షుడిగా రాష్ట్ర రెవెన్యూ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, సభ్యులుగా ఉమ్మడి జిల్లా మంత్రులు పయ్యావుల కేశవ్, సవిత, సత్యకుమార్ యాదవ్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని నియమించారు. ప్రభుత్వం సత్యసాయి శతజయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించిన నేప థ్యంలో వేడుకల విజయవంతం కోసం మంత్రుల కమిటీ నియమించింది. నవంబర్ 23వ తేది సత్యసాయి శతజ యంతి ఉత్సవాలు పూర్తయ్యే వరకు ఏర్పాట్లు, నిర్వహణను మంత్రుల కమిటీ పర్యవేక్షిస్తుంది.

ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి హర్షం

సత్యసాయిబాబా శతజయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించ డంతో పాటు ఉత్సవాల నిర్వహణ విజయవంతం కోసం మంత్రుల కమిటీ ఏర్పాటు చేయడం పట్ల ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఉత్సవాల నిర్వ హణ కోసం తాను కూడా మంత్రుల కమిటీ, అధికారులతో కలిసి కృషి చేస్తానని తెలిపారు.

↓ ప్రశాంతి గ్రామం వద్ద ఏర్పాటుచేసిన స్వాగత తోరణం



సకాలంలో పూర్తి చేస్తాం : క్రాంతి కుమార్, కమిషనర్, పుట్టపర్తి



సత్యసాయిబాబా శతజయంతి వేడుకల్లో పాల్గొనే భక్తులకు అవసరమైన ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేస్తాం. ఇందుకోసం రూ.3.69 కోట్లు నిధులను ఖర్చు చేస్తున్నాం. శానిటేషన్, వీధి దీపాలు, భూగర్భ డ్రైనేజీ, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య సేవలు, వాహనాల పార్కింగ్‌కు ముందస్తు ఏర్పాట్లు చేపట్టాం. జయంతికి పది రోజుల ముందే అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తాం. భక్తులు ప్రశాంత వాతావరణంలో సత్యసాయి జయంతి వేడుకల్లో పాల్గొని, మహా సమాధిని దర్శించుకుని వెళ్లడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను చేస్తున్నాం.

డ్రైనేజీ సమస్య రాకుండా చూడాలి: నాగార్జున శెట్టి, పుట్టపర్తి



పుట్టపర్తి పట్టణంలో తరచూ భూగర్భ డ్రైనేజీ పొంగి పొర్లి ఇబ్బందిగా మారుతోంది. గతంలో సత్యసాయి జయంతి వేడుకలలో ప్రధాన రోడ్డుపై డ్రైనేజీ సమస్య ఏర్పడి భక్తులు, స్థానికులు ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతము శత జయంతి వేడుకలకు లక్షల్లో భక్తులు వస్తుండటంతో డ్రైనేజీ సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి.

ఏర్పాట్లు బాగా చేస్తున్నారు: దాసరి నాగభూషణ, పుట్టపర్తి



సత్యసాయి శతజయంతి వేడుకలకు ప్రభుత్వ పరంగా అధికారులు, ప్రజాప్రతినిధులు చేస్తున్న ఏర్పాట్లు చాలా బాగా ఉన్నాయి. భక్తులకు అవరసమైన ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేస్తే బాగుంటుంది. ప్రపంచవ్యా ప్తంగా భక్తులు వస్తుండటంతో ఇబ్బంది లేకుండా చూడా ల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉంది.

గుదిబండలా గోడౌన్లు

● ఉమ్మడి జిల్లాకు 195 మంజూరు
● 131 గోదాముల నిర్మాణం పూర్తి
● బిల్లులు చెల్లించినా ఉపయోగంలోకి రాని వైనం



6

ఊహలు గుసగులాడే !

● ఎస్కేయూ కొత్త వీసీ నియామకంపై జోరుగా ప్రచారం
● నవంబరు మొదటి వారంలో రెగ్యులర్ వీసీ అంటూ చర్చ
● పదవి కోసం ఎవరి ప్రయత్నాల్లో వారు



6

హఠాత్తుగా వదిలేసినందుకే సమస్య

● మత్తు సమస్యపై డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం



చికిత్స పొందుతున్న రోగిని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

హిందూపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మత్తు పానీయాలకు అలవాటుపడి, హఠా త్తుగా మానేస్తే వింతగా ప్రవర్తించే అవకాశం ఉందని డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్ బేగం అన్నారు. కల్లు సేవించి వింతగా ప్రవర్తిస్తూ, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని గురువారం ఆమె పరిశీలించారు. మానసిక వైద్యురాలు డాక్టర్ జీవనను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, కొన్ని మత్తు పదా ర్థాలకు అలవాటుపడి, మానుకోవడంతో ఇలాంటి వింత లక్షణాలు కలుగుతాయని అన్నారు. వారిలో విసుగు, చికాకు, నిద్రలేమి, ప్రవర్తనలో మార్పులు వస్తాయని అన్నారు. బాధితులలో పలువురు డిశ్చార్జ్ అయ్యారని, మరికొందరు చికిత్స పొందుతు న్నారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ తెలిపారు. హిందూపురం మండలం చౌళూరు, పరిగి మండలం శాసనకోటకు చెందిన పలువురు బుధవారం ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. వీరిలో ఐదుగురిని బెంగళూరుకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

కల్తీకల్లు ఎక్కడా లేదు: ఈఎస్



విలేకరులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ ఈఎస్ గోవిందనాయక్

జిల్లాలో ఎక్కడా కల్తీ కల్లు లేదని ఈఎస్ గోవిం దనాయక్ తెలిపారు. ఓ పత్రికలో (ఆంధ్రజ్యోతి కాదు) కల్తీకల్లు అని అవాస్తవాలు రాశారని గురువారం విలేకరుల సమావేశంలో అన్నారు. ప్రభుత్వానికి, ఎక్సైజ్ శాఖకు చెడ్డపేరు తెచ్చేలా ఆ కథనం ఉందని అన్నారు. దీనిపై న్యాయప రంగా ఎక్సైజ్ శాఖ ముందుకు పోతుందని అన్నారు. బాధితులలో కొందరు డిశ్చార్జి అయ్యా రని, మరికొందరు శుక్రవారం డిశ్చార్జి అవుతా రని తెలిపారు. కల్తీ కల్లు, కల్తీ మద్యం అమ్మడానికి వీలులేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. సురక్ష యాప్ ద్వారా నకిలీని కనిపెట్టవచ్చని అన్నారు. సమా వేశంలో ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య పాల్గొన్నారు.

కేసు నమోదు

కల్లు తాగి వింతగా ప్రవర్తించడంపై చౌళూరుకు చెందిన ఎంఎస్ నాగప్ప అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కల్లు దుకాణం యజమానులు ఈడిగ రామ క్రిష్టప్ప, చౌళూరుకు చెందిన కేశప్పపై కేసు నమోదు చేశామని డీఎస్పీ మహేష్ తెలి పారు.

వృద్ధులకు న్యాయ సాయం

● డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజశేఖర్



సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ రాజశేఖర్

కదిరి లీగల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): జైల్లో మగ్గిపోతున్న వయోవృద్ధులు ప్రజా న్యాయస్థానం ద్వారా సాయం పొందే వీలుం దని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. గురువారం ఆయన కదిరి సబ్ జైలును తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడారు. ఏడు పదులు దాటి జైలులో శిక్ష అనుభవిస్తున్న వృద్ధులు వారి వివరా లను జైలు అధికారులకు తెలపాలని సూచించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు కూడా న్యాయ సహాయం పొందవచ్చు అని స్పష్టం చేశారు. బెయిల్ పొంది పూచీ కత్తులు తెచ్చుకోలేని వారికి కూడా ప్రజా న్యాయస్థానం ద్వారా సాయం అందుతుందని తెలి పారు. అనంతరం నిందితుల సమస్యలను అందుతున్న ఆహార, వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. ఆయన వెంట న్యాయవాదులు లోకేశ్వర్‌రెడ్డి, దశరథ్ తదితరులు ఉన్నారు.

పరిశ్రమలతోనే ఆర్థిక ప్రగతి

● కలెక్టర్ శ్యాంప్రసాద్

పుట్టపర్తి టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల స్థాపన ద్వారానే ఆర్థిక ప్రగతి సాధ్యమని కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్ గురువారం జిల్లా పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమీక్ష సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్ర మల స్థాపన కోసం సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా వేగంగా అనుమతులు మంజూరు చేయాలని అధికారుల ను ఆదేశించారు. పెట్టుబడి రాయితీ కింద జిల్లాలోని 17 పరి శ్రమలకు రూ.12.46 కోట్లు మంజూరు చేశారు. ఐడీపీ పాలసీ ద్వారా వడ్డీ రాయితీ రూ.16.18 లక్షలు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. వచ్చే నెల 14, 15 తేదీల్లో విశాఖలో జరిగే పారిశ్రామిక ఒప్పంద సదస్సుకు సంబంధించిన అవగాహన ఒప్పందాలు భూమి పూజలు, పరిశ్రమల ప్రారంభోత్సవాల గురించి సమీక్షించారు. ఏపీఐఐసీకి సంబంధించిన పరిశ్రమల ప్రగతి, వాటికి సంబంధించిన అంశాల గురించి కూడా సమావేశంలో చర్చించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జన రల్ మేనేజర్ నాగరాజు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నాగ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి సమత, విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఎల్‌డీఎం రమణ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శాంప్రసాద్

ఓపీతో బీపీ..!

పెద్దాసుపత్రిలో రెండు గంటలే ఓపీ సేవలు

10కి వచ్చి 12గంటలకే వెళ్లిపోతున్న డాక్టర్లు
మధ్యాహ్నమైతే అన్ని విభాగాలకూ తాళమే
సుదూర ప్రాంతాలవారికి అందని వైద్య సేవలు
ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రోగుల సహాయకులు

అనంతపురం వైద్యం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నిబంధనల మేరకు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఓపీ సేవలు నిరంతరాయంగా అందించాలి. అయితే నగరంలోని పెద్దాస్పత్రిలో రెండు గంటల సమయం మాత్రమే ఓపీ సేవలందుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకే డాక్టర్లు అరకొరగా ఉంటున్నారు. తర్వాత సాయంత్రం 3గంటల వరకు ఓపీ మూసివేస్తున్నారు. అనంతరం పీజీ విద్యార్థులే ఒక గంటపాటు ఓపీలో రిపోర్టులు చూసి వెళ్తున్నా రని రోగులు మండిపడుతున్నారు. డ్యూటీ సమయా నికి డాక్టర్లు అందరూ బయోమెట్రిక్ వేస్తున్నారు, ఫోన్‌లో ఎఫ్ఆర్ఎస్ కూడా వేస్తున్నారు. అయినా డ్యూటీలు మాత్రం సక్రమంగా చేయడం లేదనే విమర్శలు విన వస్తున్నాయి.

అడ్మిషన్ చేస్తామన్నారు



పోయిన వారం ఓపీలో చూపించుకున్నా. మళ్లీ వారం వస్తే అడ్మిట్ చేసు కుంటామని చెప్పారు. ఇక్క డకు వస్తే ఓపీలో డాక్టర్లు ఎవరూ లేరు. సాయంత్రం 3గంటలైంది. మా ఊరి కిపోయి రేపు తిరిగిరావాలంటే కుదరదు. ఏంచే యాలో తెలియడంలేదు.

- ఆదిలక్ష్మి, సలపాల్లి, సోమందేపల్లి మండలం



సర్జరీ ఓపీ ముందు డాక్టర్ల కోసం ఎదురు చూస్తున్న రోగులు

డాక్టర్ల ఓపీ డ్యూటీలు ఇలా..

ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జనరల్ మెడిసిన్, గైనిక్, ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, పీడియాట్రిక్స్, ఆప్తా ల్మిక్, పల్మనాలజీ, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, సైకియాట్రి, డెంటిస్ట్రీ తదితర విభాగాలున్నాయి. ఒక్కో విభాగాన్ని మూడు నుంచి ఆరు యూనిట్‌లుగా విభజించి ఒక్కో యూనిట్ ఒక్కోరోజు ఓపీ చూస్తున్నారు. డ్యూటీరోజు సంబంధిత యూనిట్ అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఓపీ డ్యూటీలు చేయాలి. వారికి

(మిగతా 6లో...)

అక్రమాలకు చెక్ !

● ఎన్ఎంఎంఎస్ యాప్‌ను తెచ్చిన ప్రభుత్వం
● ఉపాధి కూలీలకు ఈకేవైసీ తప్పనిసరి
● జిల్లాలో ఇప్పటి వరకు 2,92,810 మందికి పూర్తి



కొడపగాని పల్లి సమీపంలో పనులు చేస్తున్న కూలీలు

ధర్మవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం అక్రమాలకు అడ్డు కట్ట వేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు ప్రారంభించాయి. ఇందులో భాగంగా జాతీయ మస్టరు పర్యవేక్షణ వ్యవస్థ (ఎన్ఎంఎంఎస్)యాప్ ఎను తీసుకువచ్చాయి. ఇందులో భాగంగా జాబ్‌కార్డు నంబరుకు ఆధార్‌ను అనుసంధానం చేయనున్నారు. దీంతో జాబ్‌కార్డులోని ప్రతి ఒక్కరి ఆధార్ ప్రకారం ఈకేవైసీతో పాటు ఐరిష్‌ను ఆన్‌లైన్‌లో ఉపాధి సిబ్బంది నమోదు చేస్తు న్నారు. ఈకేవైసీ చేయించుకున్నవారికే పనులు కల్పిస్తామని అధికారులు చెబు తున్నారు. జిల్లా వ్యాప్తంగా 32 మండలాలల్లో 2,78,454 మంది జాబ్ కార్డులు ఉన్నాయి. వీటి ఆధారంగా 4,70,394 మంది ఉపాధి కూలీలుగా నమోదై ఉన్నారు. వీరందరితోనూ ఈకేవైసీ చేయించాలని ఉన్నతాధికారులు ఉపాధి సిబ్బందికి ఇదివరకే ఆదేశించారు. ఇప్పటి వరకు 2,92,810 మందికి ఈకేవైసీ చేశారు. చాలామందికి వేలిముద్రలు, కళ్ల (ఐరిష్) రాకపోవడంతో ఆధార్ కేంద్రాల బాటపట్టారు. జాబ్‌కార్డు నంబరుకు అందులోఉన్న కూలీల ఆధార్ కార్డు నంబర్లను అనుసంధానం చేయడం వల్ల అక్రమాలకు కళ్లెం పడనుంది. ఒకరి జాబ్‌కార్డు తరఫున ఇంకొకరు పనికి వెళ్లేందుకు వీలు కాదు. దీంతో దొంగ మస్టర్లకు ఆస్కారం ఉండదు. నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట పడనుంది.

ఈకేవైసీ తప్పనిసరి: శ్రీలక్ష్మి, డ్వామా ఇన్‌చార్జ్ పీడీ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకానికి సంబంధించిన జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికి ఈకేవైసీ చేయించాలని ఆదేశించాయి. ప్రస్తుతం సిబ్బందితో ఆయాగ్రామాల్లోని కూలీలకు ఈకేవైసీ చేయిస్తున్నాం. ఈకేవైసీకి వేలి ముద్రలు, ఐరిష్ పడని కూలీలు ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాల్సి ఉంది. ఈ విధానం వల్ల అవినీతి,అక్రమాలకు చోటుఉండదు.త్వరలోనే గ్రామ సభలు పెట్టి జాబ్‌కా ర్డులో ఎవరైనా మృతి చెంది ఉంటే వాటిని తొలగించడం జరుగుతుంది.ఈకేవైసీ చేయించుకోనివారు త్వరగా చేయించుకోవాలి.

జిల్లాలో ఇప్పటివరకు మండలాల వారీగా ఈకేవైసీ వివరాలు ఇలా!

మండలం	కూలీలు	ఈకేవైసీ నమోదు చేసుకున్న వారు	శాతం
ముదిగుబ్బ	27,336	12,071	44.16
కొత్తచెరువు	12,233	6,476	52.94
రామగిరి	16,046	8,555	53.32
కనగానపల్లి	27,152	14,594	53.75
గోరంట్ల	20,861	11,815	56.64
రొద్దం	17,724	1,109	57.04
గుడిబండ	17,636	10,368	58.79
తాడిమర్రి	15,876	9,708	61.15
తలుపుల	18,845	11,674	61.95
పెనుకొండ	9,345	5,896	63.09
కదిరి	14,483	9,163	63.27
చెన్నేకొత్తపల్లి	25,173	15,949	63.36
నల్లమాడ	14,300	9,177	64.17
బుక్కపట్నం	14,198	9,120	64.23
అమరాపురం	13,293	8,543	64.27
సోమందేపల్లి	10,438	6,744	64.61
తనకల్లు	10,020	6,594	64.63
గాండ్లపెంట	12,998	8,410	64.70
లేపాక్షి	8,146	5,277	64.78
ఓబుళదేవర చెరువు	16,424	10,686	65.06
చిలమత్తూరు	11,456	7,475	65.25
అమడగూరు	12,920	8,504	65.82
పుట్టపర్తి	11,351	7,489	65.98
ధర్మవరం	21,643	14,645	67.67
బత్తలపల్లి	14,801	10,016	67.67
మడకశిర	14,141	9,805	69.34
రొళ్ల	11,287	8,060	71.41
నంబుల పూలకుంట	13,486	9,727	72.72
పరిగి	11,351	8,316	73.26
హిందూపురం	4,164	3,083	74.04
అగళి	11,244	8,464	75.28

● జిల్లాలోని 32 మండలాల్లో 4,70,394 మంది ఉపాధి హామీ కూలీలు ఉండగా 2,92,810 మంది ఈకేవైసీ చేయించుకు న్నట్లు డ్వామా ఇన్‌చార్జ్ పీడీ శ్రీలక్ష్మి తెలిపారు.

గుదిబండలా గోడౌన్లు!

ఉమ్మడి జిల్లాకు 195 మంజూరు
131 గోదాముల నిర్మాణం పూర్తి

బిల్లులు చెల్లించినా ఉపయోగంలోకి రాని వైనం
సొసైటీలకు భారంగా మారిన ఈఎంఐల చెల్లింపు
ఓ డెప్యుటేషన్ అధికారి నిర్వాకంతోనే సమస్యలు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో గోడౌన్‌ల నిర్మాణం సొసైటీలకు మోయలేని ఆర్థిక భారాన్ని మిగిల్చింది. డెప్యుటేషన్‌పై జిల్లాకు వచ్చిన ఓ అధికారి నిర్వాకం సొసైటీలకు శాపంగా మారింది. సొసైటీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 2021-22లో ఉమ్మడి జిల్లాకు 195 గోడౌన్లను కేంద్రప్రభుత్వం మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో ఆప్కాబ్, ఏడీసీసీ బ్యాంకు, సొసైటీ అధికారులు నాబార్డు నుంచి రుణాలు తీసుకుని గోడౌన్ల నిర్మాణాలను ప్రారంభించారు. ఇప్పటి వరకు 131 గోడౌన్లను మాత్రమే పూర్తి చేశారు. వాటిని కూడా సహకార శాఖకు అప్పగించకుండా మార్కెటింగ్ శాఖ ఇంజనీర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటి వరకు రుణం తీసుకుని చెల్లించిన బిల్లుల మొత్తం దాదాపు రూ.70 కోట్లకు సొసైటీల నుంచి వడ్డీ వసూలు చేస్తున్నారు. ఇది సొసైటీలకు మోయలేని భారంగా మారింది. విజయవాడలో ఉండి విధులు నిర్వహించాల్సిన ఓ ఆప్కాబ్ అధికారి గత వైసీపీ పాలనలో ఇక్కడికి డెప్యుటేషన్‌పై వచ్చారు. స్వామి భక్తిని ప్రదర్శిస్తూ ఆయన వైసీపీ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి ముడుపులు పుచ్చుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నిర్మించిన గోడౌన్లు కూడా నాసిరకంగా ఉన్నాయని ఆశాఖలోని పలువురు అధికారులు వాపోతున్నారు. పని పూర్తి చేయకనే, స్వాధీనం చేయక ముందే సొసైటీలకు మాత్రం ఈఎంఐల బాధ తప్పడం లేదు.


శింగనమలలో నిరుపయోగంగా ఉన్న సొసైటీ గోడౌన్

గడువు ముగిసినా..

మూడేళ్ల డెప్యుటేషన్ గడువు ముగిసినా ఆప్కాబ్ అధికారి ఇక్కడే ఉంటున్నారు. గోడౌన్లకు సంబంధించి కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో ఆ అధికారిది పాత్ర కీలకం. ఇప్పటి వరకు రెండు జిల్లాకు సంబంధించి గోడౌన్ల నిర్మాణంలో దాదాపు రూ.70కోట్లు చెల్లించారు. గోడౌన్ల నిర్మాణం పూర్తి అయిన తరువాత క్షేత్రస్థాయిలో సహకార శాఖ, మార్కెటింగ్, ఏడీసీసీ బ్యాంకు, సొసైటీల అధికారులు బృందంగా పర్యవేక్షణ చేసిన అనంతరం బిల్లులు చెల్లించాలి. కానీ వాటాలు పుచ్చుకుని ముందే చెల్లించారు. గోడౌన్ల నిర్మాణం నాసిరకంగా ఉన్నట్లు ఆయా సొసైటీల అధికారులు బహిరంగంగానే చెబుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. నిర్మాణం పూర్తి అయిన గోడౌన్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. కాగా డెప్యుటేషన్‌పై వచ్చిన ఆ అధికారి ఆగడాలు భరించలేకపోతున్నామని ఆశాఖలోని ఉద్యోగులు కొందరు వాపోతున్నారు.

రెండు రకాల గోడౌన్లు మంజూరు

అనంతపురం జిల్లాలో వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో 18, 500మెట్రిక్‌టన్నుల సామర్థ్యంతో 84 గోడౌన్ల నిర్మాణం చేపట్టారు. శ్రీసత్యసాయి జిల్లాలో వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో 21, 500మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో 72 మొత్తంగా 93 గోడౌన్లను నిర్మించాలని నిర్ణయించారు. అయితే ఇప్పటి వరకు అనంతపురం జిల్లాలో 68, శ్రీసత్యసాయి జిల్లాలో 63గోడౌన్ల నిర్మాణం పూర్తి చేశారు. వెయ్యి మెట్రిక్‌టన్నుల గోడౌన్ రూ.85లక్షలు, 500మెట్రిక్ టన్నుల గోడౌన్లకు రూ.45లక్షల నిధులు కేటాయించారు.


బుక్కరాయసముద్రంలో నిర్మించిన గోడౌన్

స్వాధీనం చేయకనే ఈఎంఐలు

గోడౌన్లను స్వాధీనం చేయకముందే ఈఎంఐలు చెల్లించాలనడం సొసైటీలకు భారంగా మారింది. గోడౌన్ల నిర్మాణం పూర్తయిన వెంటనే ఉపయోగంలోకి వస్తే, వాటి ద్వారా వచ్చే ఆదాయంతో ఈఎంఐలు చెల్లించే అవకాశం సొసైటీలకు కలుగుతుంది. నాబార్డు ద్వారా ఆప్కాబ్‌కు, అక్కడి నుంచి ఏడీసీసీ బ్యాంకుకు, దాని నుంచి సొసైటీలకు రుణాలు చెల్లిస్తారు. సొసైటీలు తీసుకున్న రుణాలకు 4శాతం వడ్డీతో తిరిగి బ్యాంకుకు చెల్లించాల్సి ఉంటుంది. బ్యాంకు రుణం ఇచ్చినప్పటి నుంచే వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ఇదే ఇప్పుడు సొసైటీలకు భారంగా మారింది.

స్వాధీనం చేసుకోవాల్సి ఉంది



సహకార శాఖకు సంబంధించిన గోడౌన్లను స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. నిర్మించిన గోడౌన్‌లను స్వాధీనం చేయాలని పలుమార్లు మార్కెటింగ్ శాఖ ఇంజనీరుకు లేఖ రాశాం. అయితే ఇప్పటి వరకు ఒక్కటి స్వాధీనం చేయలేదు. నిర్మాణం పూర్తి అయిన వాటికి బిల్లులు చెల్లించారు. ఈ చెల్లింపులన్నీ ఆప్కాబ్, మార్కెటింగ్ శాఖద్వారానే జరిగాయి. స్వాధీనం చేసిన గోడౌన్‌లను అద్దెకు ఇచ్చి, సంపద వృద్ధి చెందేలా చూస్తాం.

- అరుణకుమారి,
జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ)

మొక్కపోయిన ధర

- మొక్కజొన్నకు మద్దతు ధర కరువు
- నష్టాలు తప్పవంటున్న రైతులు



పొలాల్లో నిల్వ ఉన్న మొక్కజొన్న పంట, నూర్పిడి చేస్తున్న యంత్రం



శింగనమల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఎంతో కష్టపడి పండించిన పంటకు కనీస మద్దతు ధరలేక తీవ్రంగా నష్టపోతున్నామని మొక్కజొన్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది గిట్టుబాటు ధర లభించడంతో మండలంలో ఈ ఏడాది 30 గ్రామాల పరిధిలో విస్తారంగా మొక్కజొన్న సాగు చేశారు. దాదాపు 2వేల ఎకరాల్లో సాగు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుతం పంట నూర్పిళ్లు జరుగుతున్నాయి. గత ఏడాది మద్దతు ధర రూ.2600 ఉండటంతో రైతులకు మంచి లాభాలు వచ్చాయి. అయితే ఈ ఏడాది ప్రభుత్వమే మద్దతు ధర క్వింటాకు రూ.2400 ప్రకటించింది. దీంతో నూర్పిడి చేసిన ధాన్యాన్ని రైతులు విక్రయించకుండా పొలాల్లోనే ఆరబోస్తున్నారు. దళారీలు రంగ ప్రవేశం చేసి ఆ ధరను కూడా రెండువేల లోపునకు తెచ్చినట్లు రైతులు వాపోతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు శూన్యం

కొనులుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కనీస మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తామన్న ప్రభుత్వ హామీ ఆచరణకు నోచుకోవడం లేదు. 20 రోజులగా పంట నూర్పిడి జరుగుతున్న నేటికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తీరా దళారీలు పంట కొనుగోలు చేశాక ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఎవరికి ప్రయోజనమని ప్రశ్నిస్తున్నారు.

గుత్తకు తీసుకుని సాగు చేశా: రైతు నాగమునయ్య, జూలాకాల్వ



గత ఏడాది రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. ఖర్చులన్నీ పోను బాగానే గిట్టుబాటు అయ్యింది. దీంతో ఈ ఏడాది నా పొలంతో పాటు మరో ఏడు ఎకరాలు గుత్తకు తీసుకుని మొక్కజొన్న సాగు చేశా. రూ.4 లక్షల దాకా పెట్టుబడి పెట్టా. దిగుబడి బాగా వచ్చింది. అయితే ధర మాత్రం నేల చూపులు చూ స్తోంది. క్వింటా రూ. రెండువేలకు అడుగుతున్నారు. ధర పెరుగుతుందనే ఆశతో పొలంలోనే ధాన్యం ఆరబోశాం. అయితే వాన దేవుడు నష్టం కలిగిస్తాడేమోననే భయం కూడా వెంటాడుతోంది.

రూ.రెండు వేల లోపే: మహిళా రైతు అరుణ, జూలాకాల్వ



మేము నాలుగు ఎకరాల్లో పంట సాగు చేశాం. దిగుబడి బాగుంది. అయితే నిన్న మొన్నటి దాకా ఉన్న ధర ప్రస్తుతం లేకుండా పోయింది. కింటా రూ.2వేలకు అడుగుతున్నారు. అప్పులు చేసి రూ.రెండున్న లక్ష వరకు పెట్టుబడి పెట్టాం. గిట్టుబాటు ధర లేకపోతే అప్పులకు వడ్డీలు కూడా కట్టడం కష్టమవుతుంది. ప్రభుత్వమే మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి.

ఉన్నతాధికారులకు నివేదించాం: అన్వేష్‌కుమార్, ఏఓ, శింగనమల



మండలంలో రైతులు ఎక్కువ శాతం మొక్కజొన్న పంట సాగు చేశారు. వారి ప్రయోజనం దృష్ట్యా మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు నివేదించాం. అనుమతులు రాగానే క్షేత్ర స్థాయిలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తాం. మద్దతు ధరతో మొక్కజొన్న పంట కొనుగోలు చేస్తాం.

సహకార వ్యవస్థను బలోపేతం చేద్దాం



అంతర్జాతీయ సహకార సంవత్సర వేడుకల్లో ఏడీసీసీ, డీసీఎంఎస్ ఛైర్మన్లు కేశవరెడ్డి, నెట్టెం వెంకటేశులు, డీసీఓ అరుణకుమారి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సహకార వ్యవస్థను బలోపేతం చేయడం వల్ల రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఆ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి నిర్ణయించిన అంతర్జాతీయ సహకార సంవత్సరం-2025 వేడుకలను గురువారం స్థానిక కమలానగర్‌లోని డీసీఎంఎస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ ఛైర్మన్ నెట్టెం వెంకటేశులు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో డీసీఎంఎస్ సేవలను మరింత విస్తృత పరిచేలా ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గానికి ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అటు రైతులు, ఇటు పేదలకు సేవలు చేరువ చేయడమే లక్ష్యంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి మాట్లాడుతూ.. డీసీఎంఎస్, సొసైటీలతో కలిసి ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తులు పెంచడానికి, హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఏడాది పొడవునా రైతులకు పంట రుణాలు అందజేసి అండగా ఉంటామని అన్నారు. జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) అరుణకుమారి మాట్లాడుతూ.. జిల్లాలో ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్ సేవలను విస్తృత పరిచేందుకు సహకార సొసైటీలను బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. నాణ్యమైన ఎరువులు, క్రిమిసంహారక మందులు రైతులకు తక్కువ ధరకే ఇస్తామని తెలిపారు. రాయలసీమ సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. రైతులకు సేవలందించిడంతో డీసీఎంఎస్ రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉందని అన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా మేనేజర్ విజయభాస్కర్, జిల్లా సహకార విద్యాధికారి మురళీమోహన్, డీసీఎంఎస్ అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, ఏఓ సుధాకర్‌రెడ్డి, సొసైటీ ఛైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.

పాపంపేట భూవివాదానికి శాశ్వత పరిష్కారం

- ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్ భరోసా


పాపంపేట వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్

అనంతపురంరూరల్/అనంతపురం క్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపంపేట భూ వివాదానికి శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేద్దామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ తెలిపారు. గత కొన్నిరోజులుగా పాపంపేటలో సామాన్య ప్రజల భూములను, ఇళ్లను మరొకరు కాజేస్తున్నారంటూ వస్తున్న అంశంపై ఇటీవల పరిటాల శ్రీరామ్ స్పందించారు. ఈ క్రమంలోనే మూడురోజుల కిందట పాపంపేటలో మీడియా సమావేశంలో మాట్లాడారు. బాధితులు, పాపంపేట పెద్దలతో సమావేశమవుతామని చెప్పారు. ఆ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితులు, పాపంపేట పెద్దలతో బుధవారం సమావేశమయ్యారు. సమస్య పరిష్కారానికి ఏమి చేయాలన్న దానిపై వారితో సుదీర్ఘంగా చర్చించారు. మొత్తం అక్కడ నివాసముంటున్న వారందరికీ శాశ్వత పరిష్కారం చేసే ప్రయత్నం చేద్దామని అన్నారు. మీరు ఉంటున్న నివాస గృహాలతో పాటు, కొన్ని ఖాళీస్థలాలు మీకే చెందేలా శాశ్వత పరిష్కారాన్ని చూపేలా ముందుకు వెళ్దామని తెలిపారు. ఆ మేరకు ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ స్థానికులకు స్పష్టమైన హామీ ఇచ్చారు.

జేఎన్‌టీయూలో ముగిసిన సీఏఎస్ ఇంటర్వ్యూలు

అనంతపురంరూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీఏఎస్) ఇంటర్వ్యూలు గురువారం ముగిశాయి. ఈనెల 28న వర్సిటీ వైస్ చాన్స్‌లర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య అధ్యక్షతన ఇంటర్వ్యూలు చేపట్టారు. వివిధ విభాగాల అధ్యాపకులకు ఉద్యోగోన్నతికై సీఏఎస్ కింద అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లతో ఇంటర్వ్యూలు చేపట్టారు. తొలిరోజు మెకానికల్, ఈఈఈ, రెండోరోజు ఈసీఈ, కెమికల్, సీఎస్ఈ, కెమిస్ట్రీ, మ్యాథమ్యాటిక్స్, మూడో రోజు సివిల్ విభాగాలకు సంబంధించిన అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్లకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో మొత్తం 45 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో వివిధ బోర్డ్ ఆఫ్ మెంబర్స్ ఛైర్మన్లు, సబ్జెక్ట్ నిపుణులు పాల్గొన్నారు.

ఊహలు గుసగుసలాడే!

- ఎస్కేయూ కొత్త వీసీ నియామకంపై జోరుగా ప్రచారం
- నవంబరు మొదటి వారంలో రెగ్యులర్ వీసీ అంటూ చర్చ
- పదవి కోసం ఎవరి ప్రయత్నాల్లో వారు


శ్రీకృష్ణ దేవరాయ విశ్వ విద్యాలయం

అనంతపురంరూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి త్వరలోనే కొత్త వైస్‌చాన్సలర్ వస్తారంటూ ప్రచారం జోరుగా సాగుతోంది. ఫలానా వారే వస్తారంటూ కూడా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అన్నీ సవ్యంగా జరిగితే నవంబరు మొదటి వారంలోనే కొత్త వీసీ వస్తారని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో అంతకుముందు ప్రభుత్వం వర్సిటీ వీసీ నియమితులైన వ్యక్తి తన పదవి నుంచి తప్పుకున్నారు. దీంతో విశ్వవిద్యాలయం పరిధిలోని ఎంబీఏ విభాగం సీనియర్ ప్రొఫెసర్ అనితకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. గత ఏడాది జూన్‌లో ఆమె బాధ్యతలు తీసుకున్నారు. ఆమె వీసీ పదవి చేపట్టి 16 నెలలు కావడంతో కొత్త వీసీని నియమిస్తారంటూ ప్రచారం సాగుతోంది. ఈనేపథ్యంలో చాలా మంది వీసీ పదవి కోసం పోటీ పడుతున్నట్లు సమాచారం. ఎవరికీ వారు తమ రాజకీయ పలుకుబడితో ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం. వర్సిటీలో పనిచేస్తున్న పలువురు సీనియర్ ప్రొఫెసర్లతోపాటు గతంలో ఇక్కడ పనిచేసిన ప్రొఫెసర్లు సైతం పోటీలో నిలిచినట్లు తెలిసింది. కొత్త వీసీ నియామకం కోసం రెండు మూడు నెలల కిందటే సెర్చ్ కమిటీ ఏర్పాటైంది. త్వరలో నియామకం జరుగుతుందని భావించినా అది కార్యరూపం దాల్చలేదు.

ఫలానా వారే వస్తారంటూ చర్చ

వర్సిటీ వీసీగా సెర్చ్ కమిటీ ఎన్ఐటీ ప్రొఫెసర్లు, ఐఏఎస్‌ల పేర్లు ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే రాజకీయపరమైన ఇబ్బందులు వస్తాయనే భావనతో వీసీగా వచ్చేందుకు వారు ఆసక్తి చూపలేదనే ప్రచారం ఉంది. ఇటీవల ఓ యూనివర్సిటీకి సదరు కేడర్ వారిని వీసీగా నియమించినా ఆయన విధుల్లో చేరలేదు. దీంతో అదే యూనివర్సిటీలోని ప్రొఫెసర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. స్థానిక వర్సిటీ పరిస్థితి కూడా ఇలాగే ఉందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈక్రమంలో ప్రస్తుత ఇన్‌చార్జ్ వీసీనే వర్సిటీ రెగ్యులర్ వీసీగా నియమించే అవకాశం ఉందన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. మరో వైపు గతంలో వర్సిటీలో ప్రొఫెసర్‌గా, రిజిస్ట్రార్‌గా పనిచేసిన వ్యక్తి పేరుకూడా వీసీ పదవికి ప్రముఖంగా వినిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ఓ ప్రజాప్రతినిధి ద్వారా ఆయన ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈయనతోపాటు వర్సిటీలోని ప్రొఫెసర్లు తమ శక్తి మేర ప్రయత్నాలు చేస్తున్నారన్న వాదనలున్నాయి. రాష్ట్రంలో తుఫాన్ ప్రభావం లేకపోయింటే నియామక ప్రక్రియ ముగిసేదని పలువురు పేర్కొంటున్నారు.


డాక్టర్లు రాకపోవడంతో ఆర్థో ఓపీ పురుషుల విభాగంలోనే స్త్రీ, పురుషుల రిపోర్టులు చూస్తున్న పీజీ విద్యార్థులు



జనరల్ మెడిసిన్ విభాగం కార్యాలయానికి తాళం

ఓపీతో బీపీ..!

(5వ పేజీ తరువాయి)

తోడుగా సీనియర్ రెసిడెన్సీ(ఎస్ఆర్)లు, పోస్ట్ గ్రాడ్యుయేట్(పీజీ) విద్యార్థులుంటారు. ఓపీకి వచ్చిన వారిని పరీక్షించి అవసరమైన రోగులను అడ్మిట్ చేసుకోవాలి. అడ్మిషన్ బుక్‌లో ట్రీట్‌మెంట్, రోగనిర్ధారణ పరీక్షలురాసి వార్డుకు పంపాలి. అడ్మిషన్ చేసుకున్న రోగులను ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వార్డుల్లో రౌండ్స్‌వేసి పరీక్షించాలి. అవసరమైన వారికి ఆపరేషన్లు చేయాలి. ఇదీ ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోజువారిగా డాక్టర్లు నిర్వహించాల్సిన విధులు.

డ్యూటీలు చేస్తున్నది ఇలా...

యూనిట్ ఇన్‌చార్జ్ అయిన అసోసియేట్ ప్రొఫెసర్ ఓపీకి రావడంలేదు. చుట్టపుచూపుగా వచ్చి వెళ్తున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఎస్ఆర్‌లు, పీజీలు మాత్రమే ఓపీ డ్యూటీ చేస్తున్నారు. అదికూడా ఉదయం 10 వచ్చి మధ్యాహ్నం 12గంటలవరకు మాత్రమే ఉంటున్నారు. ఇక సాయంత్రం ఒకగంట సమయం పీజీ విద్యార్థులు ఓపీకి వస్తున్నారు. దీంతో మధ్యాహ్నం 12గంటలైతే ఓపీ చూడటంలేదని, మరుసటి రోజు రావల్సి వస్తోందని వివిధ ప్రాంతాల నుంచి పెద్దాస్పత్రికి వచ్చిన రోగులు వాపోతున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే, 'డాక్టర్ అన్నాక ఎక్కడో ఒకచోట ఉంటారని' జవాబిస్తున్నారు. వార్డు, ఓటీ ఇలా ఆస్పత్రి మొత్తం వెదికినా కనపడరు. ఈ విషయం పర్యవేక్షక అధికారులకు తెలియంది కాదు.

మధ్యాహ్నం మూసివేత

మధ్యాహ్నం అయితే చాలు ప్రతిరోజు దాదాపు అన్ని విభాగాల ఓపీలను మూసివేస్తున్నారు. ఆయా విభాగాల డిపార్ట్‌మెంట్ల కార్యాలయాలకు సైతం తాళాలు వేస్తున్నారు. విభాగాధిపతులు ఆయా విభాగాల ఓపీ, ఐపీ, ఆపరేషన్ తదితర క్లినికల్ సేవలను పర్యవేక్షించాలి. విభాగాధిపతులే విధుల్లో లేకుంటే కిందిస్థాయి డాక్టర్లు, సిబ్బంది ఎలా పని చేస్తారని రోగులు, వారి సహాయకులు మండిపడుతున్నారు.

పొద్దున చూసిన డాక్టర్లు లేరు



ఓపీలో డాక్టర్లు రెండు గంటలు మాత్రమే పని చేస్తున్నారు. ఉదయం 10గంటలకు వచ్చి 12గంటలకే వెళ్లిపోతున్నారు. ఓపీ3లో చూపించుకున్నా. స్కానింగ్ చేయాలని డాక్టరు చీటీ రాసి పంపారు. స్కానింగ్ చేయించుకుని రిపోర్టులు తీసుకుని వచ్చేసరికి సాయంత్రం 3 గంటలైంది. వాటిని చూపిద్దామంటే పొద్దున చూసిన డాక్టర్లులేరు.

- రామకృష్ణారెడ్డి, మంగపట్నం, నార్పల మండలం


నిర్విరామంగా ఓపీ ఉండాలి

ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు అన్నివిభాగాల ఓపీలు నిర్విరామంగా కొనసాగాలి. ఓపీ యూనిట్ డాక్టర్‌తోపాటు అసిస్టెంట్ డాక్టర్లు, ఎస్ఆర్‌లు, పీజీలు సాయంత్రం 4గంటల వరకు డ్యూటీలో ఉండాలి. మధ్యాహ్నం భోజన సమయంలో కొందరు వెళ్తే మిగిలినవారు ఓపీ చూడాలి. ఓపీ గదులకు తలుపులు వేయడం, తాళం వేయడం చేస్తే సంబంధిత డ్యూటీ డాక్టర్లపై చర్యలు తీసుకుంటాం. విభాగాల కార్యాలయాలను మూసి వేయకూడదు. సాయంత్రం 5గంటల వరకు హెచ్ఓడీలు ఉండాలి.

- డాక్టర్ సుబ్రహ్మణ్యం,
అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాల

టమోటా కిలో రూ.20

అనంతపురం రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో గురువారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.20తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్ కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8తో, సరసరిగా రూ.14తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2100 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.



రేపు పెద్దన్నవారిపల్లికి సీఎం


పెద్దన్నవారిపల్లి గ్రామంలో పర్యటిస్తున్న ఎస్పీ, కలెక్టర్, ఎమ్మెల్యే

కదిరి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తలుపుల మండలం పెద్దన్నవారిపల్లికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం రానున్నట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హెలిప్యాడ్ స్థలం, సభావేదికను గురువారం పరిశీలించారు. ప్రతినెలా రాష్ట్రంలోని ఏదో ఒక గ్రామంలో ఎన్‌టీఆర్ భరోసా సామాజిక పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటున్నారు. అందులో భాగంగా నవంబరు నెలకు సంబంధించి కదిరి నియోజకవర్గంలోని తలుపుల మండలం పెద్దన్నవారిపల్లికి వస్తున్నారు. తలుపుల మండలానికి ముఖ్యమంత్రి తొలిసారి వస్తుండటంతో తమ ప్రాంత అభివృద్ధికి ఏమైనా హామీలు ఇస్తారేమోనని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వీవీఎస్ శర్మ, డీఎస్పీ శివనారాయణస్వామితో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి : విప్


వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న విప్ కాలవ

డి.హీరేహాళ్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న అభివృద్ధితో ప్రపంచం రాష్ట్రం వైపు చూస్తోందని, రాబోవు స్థానిక ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించి .. అభివృద్ధికి మరింత సహకరించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు. గురువారం మండలంలోని లింగమనహళ్లిలో వాటర్‌ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ హనుమంతరెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్లి రాజు, మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ దాసనాయక్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

రైతు సమస్యలపై ప్రత్యక్ష పోరు

- అనంతపురంలో కబ్జాల పర్వం
- వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, రైతాంగ సమస్యలపై వైసీపీ ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమవుతోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. గురువారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రబీ సీజన్ ప్రారంభమై నెల గడిచినా రైతులకు పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేయలేని పరిస్థితి ఉందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక విత్తనాలు, ఎరువులు కూడా సకాలంలో అందడం లేదన్నారు. జిల్లాలో రబీ సీజన్‌లో పప్పుశనగ సాగు 70 హెక్టార్లలో ఉంటుందని, సీజన్ ప్రారంభమై నెలరోజులవుతున్నా ఇంకా విత్తనాలు పంపిణీ చేయలేదని అన్నారు. గత ఏడాది జిల్లాకు 27వేల క్వింటాళ్ల పప్పుశనగ కేటాయిస్తే, ఈ ఏడాది 14వేల క్వింటాళ్లు మాత్రమే కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై ఒక్క ప్రజాప్రతినిధి కూడా అడిగిన పాపాన పోలేదన్నారు. ప్రజాప్రతినిధులు తమ ఆదాయం కోసం తప్ప రైతుల గురించి ఆలోచన చేయడం లేదన్నారు. అధికారులు కూడా ప్రజాప్రతినిధుల మెప్పు కోసమే పనిచేస్తున్నారని విమర్శించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా జిల్లా వ్యాప్తంగా భూ కబ్జాలు జరుగుతున్నాయన్నారు. ఎవరెప్పుడు తమ స్థలం కబ్జా చేస్తారోనని ప్రజలు భయపడుతున్నారని, కలెక్టర్, ఎస్పీ బాధితులకు భరోసా ఇవ్వలేరా అని ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోనే రేషన్, లిక్కర్ దందా జోరుగా సాగుతోందన్నారు. అనంతపురంలో ఎమ్మెల్యే అనుచరులే భూదందాలకు పాల్పడుతున్నారని, బుడగ జంగాలకు చెందిన భూములు, ప్రైవేట్ స్కూల్ యజమానులకు చెందిన భూములను లాక్కుంటున్నారని ఆరోపించారు. పాపంపేట భూముల విషయంలోనూ ఇదే జరుగుతోందని అన్నారు. ఇనాం, శ్రోత్రియం భూముల పేరుతో జీపీఏలు చేయించుకుని స్థలాలు ఆక్రమించే పరిస్థితి వచ్చిందని తెలిపారు. అనంతపురంలో ఎక్కడ చూసినా మద్యం దందా సాగుతోందన్నారు.

వాల్మీకి అడుగుజాడల్లో నడుద్దాం: బీకే



ప్రసంగిస్తున్న ఎంపీ బీకే పార్థసారథి

రొద్దం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నవసమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ వాల్మీకి మహర్షి అడుగుజాడల్లో నడుద్దామని హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బీకే పార్థసారథి పేర్కొన్నారు. బుధవారం రొద్దం మండల పరిధిలోని రొప్పాల గ్రామంలో వాల్మీకి జయంతి వేడుకల్లో ఎంపీలు బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీకే మాట్లాడుతూ.. సమాజంలో అనుబంధాలు ఎలా బలపడాలో వాల్మీకి మహర్షి గ్రంథాలు రాశారని అన్నారు. వాటితో ఎంతోమంది స్ఫూర్తి పొందారని అన్నారు. కుల సంఘాల కోసం కల్యాణమండపాలు కట్టడానికి నిధులు కేటాయిస్తామని తెలిపారు. అట్టడుగున ఉన్న బీసీ కులాలు ఉన్నతస్థాయికి ఎదిగి రాజకీయాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. అనంతపురం పార్లమెంట్ సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో రామాయణ, మహాభారతం నాటకాలు ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. వాల్మీకి వారసులుగా మంచి పనులు చేసి అందరికీ ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సూర్యనారాయణ, చిన్నప్పయ్య, రొద్దం నర్సింహులు, సుబ్బరత్నమ్మ పాల్గొన్నారు.

హోమాలు.. పూర్ణాహుతి

నెట్టికంటి ఆలయంలో కొనసాగుతున్న పూజలు

గుంతకల్లు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో రాజగోపుర కలశ స్థాపనా కార్యక్రమంలో భాగంగా గురువారం పలు రకాల హోమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం దేవస్థాన యాగశాలలో చతుర్వేద పారాయణం, నిత్యారాధన, ద్వారాతోరణ పూజ, ఉప కుంభారాధన, చతుఃస్థానార్చన, నవకలశ స్నపనం, మూల మంత్ర హవనం, మన్యుసూక్త హవనం, సుదర్శన హవనం, సుదర్శన అభిషేకం, పంచ సూక్త హవనం, పరివార ప్రాయశ్చిత్త హవనం, పూర్ణాహుతి కార్యక్రమాలను చేపట్టారు. సాయంత్రం పారాయణాలు, అర్చనలు, ఆరాధనలతోపాటు పలు నదుల నుంచి తెచ్చిన జలాలతో 18 కలశాల శయ్యాధివాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఈఓ విజయరాజు మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 11-11 గంటలకు కలశాల శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, బీఎస్ కృష్ణారెడ్డి, తలారి మస్తానప్ప, వీరేశ్ కుమార్, ధర్మకర్త సుగుణమ్మ, ఆలయ అధికారులు, అర్చకులు, వైదికులు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పుల బాధతో మాజీ సైనికుడి ఆత్మహత్య

గార్లదిన్నె, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక మాజీ సైనికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మండలంలోని మర్తాడు గ్రామానికి చెందిన మాజీ సైనికుడు నరసింహప్ప (82) గురువారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు.. మర్తాడుకు చెందిన నరసింహప్ప సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. తరువాత గ్రామంలోనే కుమారులతో కలిసి ఆర్మీ కోచింగ్ సెంటర్ నిర్వహిస్తుండేవారు. సరైన ఆదరణ లేకపోవడంతో సెంటర్‌ను మూసివేశారు. వ్యవసాయం, ఆర్మీ కోచింగ్ సెంటర్ కోసం సుమారు రూ. 20 లక్షల వరకు అప్పులయ్యాయి. అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు రావడంతో మనస్థాపం చెంది బుధవారం రాత్రి ఇంట్లోనే పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్ తెలిపారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

11 ద్విచక్రవాహనాలు స్వాధీనం

హిందూపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ మహేష్ తెలిపారు. వారి నుంచి 11 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అరెస్ట్ వివరాలను డీఎస్పీ వెల్లడించారు. రెండు రోజుల కిందట తూమకుంట చెక్‌పోస్టులో అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో అటువైపు బైక్‌పై వచ్చిన వారిని ఆపి, వాహన పత్రాలను అడిగారు. వారు ఎలాంటి రికార్డులు చూపించకపోవడంతో అనుమానం వచ్చి తమదైన శైలిలో విచారించారు. దీంతో ఆ బైక్‌ను హిందూపురం మండలం రామచంద్రాపురం వద్ద చోరీ చేసినట్లు తెలిపారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా మరో పది ద్విచక్రవాహనాలను చోరీచేసి ఓ షెడ్డులో దాచి ఉంచినట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో హిందూపురం మండలం రామచంద్రాపురానికి చెందిన మోక్షిత్, గౌరీబిదనూరుకు చెందిన ఉమర్‌ఫారూక్, హిందూపురం ఆటోనగర్‌కు చెందిన జమీర్ ఖాన్‌లు ఉన్నారు. మోక్షిత్ ఓ హత్యకేసులో కూడా నిందితుడుగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను పట్టుకున్న సీఐ ఆంజనేయులు, ఎస్ఐ మునిప్రతాప్, గౌతమిలను అభినందించారు. సమావేశంలో సీఐ రాజగోపాల్‌నాయుడు, ఆంజనేయులు, జనార్దన్, ఎస్ఐలు మునిప్రతాప్, గౌతమి పాల్గొన్నారు.

కుక్కదాడి.. తెగిన చిన్నారి చెవి

బెంగళూరు ఆసుపత్రికి తరలింపు



కుక్కదాడిలో చిన్నారికి తెగిన చెవి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నగరంలో రోజురోజుకు కుక్కల బెడద అధికమవుతోంది. ఇందుకు గురువారం సాయంత్రం నగరంలో జరిగిన ఘటనే నిదర్శనం. ఎర్రనేలకొట్టాల కాలనీలో నివసిస్తున్న ప్రకాష్, సునీత దంపతుల కుమార్తె షైనీ ఒకటో తరగతి చదువుతోంది. ఇంటి నుంచి సాయంత్రం అంగడికి వెళ్లి తిరిగి వస్తున్న చిన్నారి షైనీపై ఒక్కసారిగా కుక్క దాడి చేసింది. గమనించిన స్థానికులు కుక్కను తప్పించాలని యత్నించగా ఎంత సేపటికీ వదల్లేదు. కుక్క తీవ్రంగా కరవడంతో చిన్నారి ఎడమ చెవి తెగిపోయింది. స్థానికులు గట్టిగా అరవడంతో వదిలేసింది. తల్లిదండ్రులు సమాచారం తెలుసుకుని చిన్నారిని హుటాహుటిన ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోస బెంగళూరుకు తరలించా రు. తెగిన చెవితో సహా అంబులెన్స్‌లో బెంగళూరుకు తీసుకెళ్లారు. తాను ప్రైవేటుగా చిరు ఉద్యోగం చేస్తున్నానని, తన కూతురు వైద్యానికి ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్ సహకరించి ఆదుకోవాలని చిన్నారి తండ్రి ప్రకాష్ వేడుకున్నారు. కుక్కల సమస్యను పరిష్కరించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవతీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కోర్టు ఆవరణలో యువకుడి ఆత్మహత్యాయత్నం



కోర్టు ఆవరణలో జయరాం

కళ్యాణదుర్గం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పోలీసులు తనను వేధిస్తున్నారని కంబదూరు మండలం కొత్తపల్లికి చెందిన జయరాం కళ్యాణదుర్గం కోర్టు ఆవరణంలో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన మేరకు.. కుటుంబ కలహాల నేపథ్యంలో చేయని తప్పునకు అక్రమంగా కేసులు పెట్టి కంబదూరు పోలీసులు తనను వేధిస్తూ, ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో గురువారం కళ్యాణదుర్గం జూనియర్ కోర్టు ఆవరణంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నేరుగా కోర్టులోపలికి వెళ్లాడు. అక్కడున్న పోలీసులు ఆ యువకుడిపై పోసుకున్న పెట్రోల్ వాసనను పసిగట్టి వెంటనే ఒంటిపై నీరు పోసి ప్రమాదం నుంచి తప్పించారు. అనంతరం న్యాయాధికారి ఎదుట ఆ యువకుడిని హాజరు పరిచారు. ఆ యువకుడు న్యాయాధికారి ఎదుట తన ఆవేదనను వెళ్లగక్కాడు. దీంతో కళ్యాణదుర్గం జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి విచారణను శనివారానికి వాయిదా వేశారు. అనంతరం పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి సీఐ హరినాథ్ ఆ యువకుడితో పూర్తిస్థాయిలో వివరాలు సేకరించారు.

వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతి

గుంతకల్లు ఆసుపత్రిలో కాలయాపన

ఆలస్యంగా అనంతపురం పెద్దాసుపత్రికి రెఫర్



యాదవుల కవిత(ఫైల్)

అనంతపురం వైద్యం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చిన గర్భిణిని అడ్మిషన్ చేసుకుని అంతా బాగుందన్న వైద్యులు, సిబ్బంది నరకం చూపించి ఆమె మృతికి కారణమయ్యారు. ఈ హృదయ విషాదగాథకు గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి డాక్టర్లు, నర్సులు కారణమయ్యారు. బాధిత కుటుంబ సభ్యుల వివరాల మేరకు... వజ్రకరూరు మండలం, గడేహోతూరు గ్రామానికి చెందిన యాదవుల కవిత(23) గర్భం దాల్చడంతో ఫిబ్రవరి నుంచి ఈనెల 16వరకు గుంతకల్లు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చెకప్‌లు చేయిస్తున్నారు. ఈ క్రమంలో నవంబరు 5న కాన్పు కావచ్చునని, ఆలోపు మరోసారి రావాలని సూచించి పంపారు. బుధవారం కవితకు పురిటి నొప్పులు ప్రారంభం కావడంతో అంబులెన్స్ సాయంతో గుంతకల్లులోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. సాయంత్రం 5.30 గంటలకు అత్యవసర విభాగానికి తీసుకెళ్లి అడ్మిషన్ చేయించారు. ఆమె ఆరోగ్య పరిస్థితులు పరిశీలించి సాధారణ కాన్పు అవుతుందని అక్కడి వైద్యులు, సిబ్బంది కవిత భర్త సంగమేశ్వరకు తెలిపారు. రాత్రి 8 గంటలకు మరోసారి వచ్చి కవితకు సాధారణ కాన్పు అవుతుంది భయపడవద్దని చెప్పారు. అనంతరం కాన్పు చేసి మగశిశువు జన్మించాడని 8.52 గంటలకు చెప్పారు. కాసేపటికే బ్లడ్‌కావాలని చెప్పడంతో ఎందుకని బంధువులు అడిగారు. శిశువును తోసినప్పుడు చిన్న కుట్లు పడ్డాయని చెప్పారు. అర్ధరాత్రి 1 గంట వరకు కుట్లు వేస్తూనే ఉన్నారు. ఈ మధ్యలో ప్రమాదముంటే చెప్పాలని, పెద్దాసుపత్రికి వెళతామని వేడుకున్నా ఏమీకాదంటూనే వచ్చారు. తెల్లవారుజామున అనంతపురం పెద్దాసుపత్రికి తీసుకెళ్లాలని సిఫార్సు చేశారు. పెద్దాసుపత్రికి వచ్చిన కవితను చూసిన డాక్టర్లు అవాక్కయ్యారు. ఇక్కడ అడ్మిట్ చేసుకున్న అరగంటకే ఆమె మృతి చెందారు. కాన్పు అయిన వెంటనే రెఫర్‌చేయకుండా కవితకు నరకం చూపించి పంపారని ఇక్కడి వైద్యులు మండిపడ్డారు.

24 గంటల్లోనే తారుమారు...

నా భార్య కవితను బుధవారం సాయంత్రం 4 గంటలకు గుంతకల్లు ఆసుపత్రికి తీసుకెళ్లాం. గురువారం సాయంత్రం 4గంటలకు ఖననం చేశాం. 24 గంటల్లో జీవితమే తలకిందులైంది. ప్రస్తుతం 2.5 కిలోల బరువుతో మగ శిశువు మాత్రమే మిగిలాడు. బీపీ, షుగర్ బాగుందని, సాధారణ కాన్పుచేస్తామని నా భార్యను చంపేశారు. గుంతకల్లు ఆసుపత్రిలో డాక్టర్లు లేరు, హెడ్‌నర్సులు మాత్రమే ఉన్నారు. రాత్రి 9.52 గంటలకు ప్రసవమయితే అర్ధరాత్రి 1గంట వరకు కుట్లు వేస్తూనే ఉన్నారు. ప్రమాదముంటే చెప్పాలని, పెద్దాసుపత్రికి పోతామని వేడుకున్నా పట్టించుకోలేదు. చివరి క్షణంలో అనంతపురం పంపారు. ఇక్కడ స్కానింగ్ చేస్తే చాలా రక్తం పోయింది.. పల్స్‌రేట్ లేదని డాక్టర్లు చెప్పారు. తర్వాత 20 నిమిషాలకే మరణించింది. మేము కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. నిర్లక్ష్యానికి కారణమైన వారిని శిక్షించాలి. నాలాగ ఎవరికీ అన్యాయం జరగకూడదు.

\- సంగమేశ్వర, కవిత భర్త

నవజాత శిశువు మృతిపై విచారణ



ఆవులదట్ల పీహెచ్‌సీలో విచారణ చేస్తున్న డీఎంహెచ్ఓ

కళ్యాణదుర్గం/రాయదుర్గం రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆసుపత్రిలో నవజాత శిశువు మృతిపై జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈబీ దేవి గురువారం విచారణ చేపట్టారు. రాయదుర్గం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవులదట్ల పరిధిలోని టి. వీరాపురం గ్రామానికి చెందిన లక్ష్మీకాంతరెడ్డి భార్య తులసి కాన్పు కోసం కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆసుపత్రిలో చేరింది. కాన్పు సమయంలో శిశువు మృతి చెందింది. ఈ ఘటనపై బాలింత తరపు వారు ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో ఈబీ దేవి ఆవులదట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. అనంతరం కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆసుపత్రిలో విచారణచేపట్టారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ కొనసాగుతోందని, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. పీహెచ్‌సీ పరిధిలో శిశుమరణాలు సంభవిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గర్భిణీల ప్రమాదకర పరిస్థితులను ముందుగానే తెలుసుకొని అత్యుత్తమ వైద్యం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ మాధవమోహన్, హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ త్యాగరాజు, సూపర్‌వైజర్ సుజాత పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలు సాధిద్దాం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

రెండు పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాధవ్ తదితరులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మహనీయుల ఆశయసాధనకు పునరంకితమవుదామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. స్థానిక జీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆర్ఎస్ఎస్(రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్) వంద వసంతోత్సవాల సభ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్ఎస్ఎస్, గోపాలరావు ఠాకూర్ మెమోరియల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత తెలుగు ప్రాంతాల్లో ఆర్ఎస్ఎస్ పాత్ర, రాయలసీమ రాజకీయ రుషి సూర్యప్రకాష్‌రెడ్డి అనే పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రానికి బీజేపీ తొలి అధ్యక్షుడిగా సూర్యప్రకాష్‌రెడ్డి నియామకం వల్లే పార్టీ బలపడిందన్నారు. జైల్లో ఉండగానే ఎమ్మెల్సీగా గెలవడం సూర్యప్రకాష్‌రెడ్డి వ్యక్తిత్వం, ప్రజల్లో ఆయనకు ఉన్న పేరుకి నిదర్శనమన్నారు. జిల్లాకు చెందిన నీలం సంజీవరెడ్డిని రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రతిపాదించి, గెలిపించడంలో ఆయన రెడ్డి కీలకపాత్ర పోషించారని తెలిపారు. భారత్‌ను విశ్వగురువుగా నిలిపేందుకు ఆర్ఎస్ఎస్ కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ రాష్ట్ర విభాగ్ సంచాలక్ యుగంధర్ రెడ్డి, ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ హిమకర్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, సెల్స్ కన్వీనర్ చిరంజీవిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రఫీ, నాయకులు పార్థసారథి, లక్ష్మీదేవి, అశోక్‌రెడ్డి, ఆంజనేయులు, గోవింద ప్రసాద్, చక్రధర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

అనంతపురం టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఏపీ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య ఆధ్వర్యంలో నవంబరు 13న గుంటూరులో బ్రాహ్మణ యువతీ యువకుల కోసం నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. గురువారం బీజేపీ అనంతపురం జిల్లా కార్యాలయంలో మెగా జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బ్రాహ్మణ యువతీయువకుల కోసం చేపడుతున్న ఈ కార్యక్రమం ఓ అద్భుత అవకాశం అన్నారు. కార్యక్రమంలో ఏపీ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య రాష్ట్ర అడ్వైజరీ కమిటీ డైరెక్టర్ ఆలూరు లక్ష్మీనరసింహశాస్త్రి, జిల్లా అధ్యక్షుడు మురళీధర్, ప్రధాన కార్యదర్శి కరణం రామసుబ్బారావు, నార్పల మారుతి, నరసింహం, కొనకంచి మురళి పాల్గొన్నారు.

పచ్చని వాతావరణమే లక్ష్యం కావాలి

ఏపీ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య



కియ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఏపీ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): భావి తరాలకు పచ్చని వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా సర్క్యులర్ ఎకానమీ, వేస్ట్ రీసైక్లింగ్ పాలసీ అమలు చేయాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి కృష్ణయ్య అన్నారు. పెనుకొండ మండలం ఎర్రమంచి సమీపంలోని కియ, దాని అనుబంధ సంస్థలను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన ప్రసంగించారు. ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్ర వ్యాప్తంగా సర్క్యులర్ ఎకానమీ, వేస్ట్ రీసైక్లింగ్ పాలసీని క్రమపద్ధతిలో అమలు చేస్తున్నామని అన్నారు. పారిశ్రామిక వ్యర్థాలను రీసైకిల్ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు దార్శనికతతో తెచ్చిన ఈ విధానంతో పర్యావరణ పరిరక్షణ, 20 లక్షల మందికి ఉపాధి కల్పించడమే లక్ష్యమని అన్నారు. కార్పొరేషన్‌ల చైర్మన్లు, విభాగాధిపతుల సూచనల ఆధారంగా రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఈ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పరిశ్రమల శాఖ రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలు అమలు చేయడానికి రాష్ట్ర, జిల్లా స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తామని, ఉపాధి కల్పన, వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ కోసం స్వచ్ఛంద సంస్థల మద్దతు తీసుకుంటామని తెలిపారు. మంత్రులు, చైర్మన్లు, పరిశ్రమల శాఖ అధికారులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారని అన్నారు. పెట్టుబడి అవకాశాలను గుర్తించడానికి సీఎస్ఆర్, పీ4, 20 సూత్రాల ఫ్రేమ్‌వర్క్‌లను అమలు చేయడానికి సమన్వయం జరుగుతోందని తెలిపారు. చెత్త, వ్యవసాయ, రబ్బరు, ఔషధ వ్యర్థాలు పర్యావరణ కాలుష్యానికి ప్రధాన కారణాలని అన్నారు. గ్రానైట్ వ్యర్థాలను రీసైకిల్ చేసి, విలువ ఆధారిత ఆదాయ వనరుగా మార్చుకోవచ్చని తెలిపారు. పీ4 ఫౌండేషన్ ద్వారా దేశంలో సర్క్యులర్ ఎకానమీ కాన్సెప్ట్‌ను తీసుకొచ్చిన మొదటి రాష్ట్రం ఏపీ కావడం శుభ పరిణామమని అన్నారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగంపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కిషోర్ రెడ్డి, కియ లీగల్ అడ్వైజర్ సోమశేఖర్ రెడ్డి, ప్రొడక్షన్ హెడ్ వెంకటేష్, సేఫ్టీ మేనేజర్ రియాజ్ బాషా, సీపీసీటీ కాలుష్య పాలసీ పర్యావరణ నిర్వాహకుడు రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి టబ్‌లో పడి చిన్నారి మృతి



గ్రీష్మ(ఫైల్)

బుక్కరాయసముద్రం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నీళ్ల టబ్‌లో పడి 15 నెలల చిన్నారి మృతి చెందిన సంఘటన గురువారం బుక్కరాయ సముద్రంలో జరిగింది. బాధితుల తెలిపిన మేరకు... బుక్కరాయసముద్రం వీరభద్రకాలనీకి చెందిన ప్రభాకర్, రజని దంపతులకు 15 నెలల కుమార్తె గ్రీష్మ ఉంది. ప్రభాకర్ ఐదు రోజుల కిందట కూరగాయల వ్యాపారం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో భార్యతో కలిసి ప్రభాకర్ కూరగాయలు ఆటోలో పెడుతున్న సమయంలో చిన్నారి గ్రీష్మ ఆడుకుంటూ ఇంట్లో నుంచి బాత్‌రూమ్‌లోకి వెళ్లింది. ప్రమాదవశాత్తు అక్కడ ఉన్న నీటి టబ్‌లో పడిపోయింది. కొద్ది సేపటి తర్వాత ఇంట్లోకి వచ్చిన తల్లి రజని పాప కోసం వెతికింది. ఇంటి చుట్టుపట్ల వెదకగా బాత్‌రూమ్‌లో నీళ్ల టబ్‌లో పడిన చిన్నారి కనిపించింది. వెంటనే చిన్నారిని అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో ఆ తల్లిదండ్రులు బోరున విలపించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



ధర్మవరం రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు గ్రామ సమీపంలోని బిందెల ఫ్యాక్టరీ వద్ద ఈనెల 28న రాత్రి గుర్తు తెలియని వ్యక్తిని వాహనం ఢీకొట్టిందని, అతడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 28న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో.. గుర్తుతెలియని ఆ వ్యక్తిని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించామని తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, వయస్సు 50 నుంచి 55 సంవత్సరాల వరకు ఉంటుందని పేర్కొన్నారు. మృతుడు బ్లూకలర్ రైన్ కోట్, తెలుపురంగు ఫుల్‌షర్ట్, బ్లూకలర్ ప్యాంట్ ధరించిన దుస్తులు మాసి ఉన్నాయన్నారు. గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించామన్నారు. మృతుడి ఆధారాలు తెలిస్తే _ 9440796832, 9440796834 సెల్‌నెంబర్లకు సమాచారం అందించాలని ఎస్ఐ తెలిపారు.

ఆన్‌లైన్ ద్వారా తొలి కేసు పరిష్కారం

సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి రాజశేఖర్

అనంతపురం క్రైం, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తొలిసారి ఆన్‌లైన్ ద్వారా ఒక విడాకుల కేసును పరిష్కరించినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి రాజశేఖర్ తెలిపారు. 2023 నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ కేసును తొలిసారి ఆన్‌లైన్ మీడియేషన్ ద్వారా గురువారం పరిష్కరించినట్టు ఆయన పేర్కొన్నారు. తమకు విడాకుల కేసు అవసరం లేదంటూ బెంగళూరుకు చెందిన జంట మీడియేషన్ సెంటర్ కో- ఆర్డినేటర్, న్యాయాధికారి రాజశేఖర్‌ను కోరారు. బెంగళూరులో నివాసం ఉంటున్న కారణంగా కోర్టుకు హాజరు కాలేకపోవడంతో మధ్యవర్తి హరికృష్ణ ద్వారా ఆన్‌లైన్‌లో మీడియేషన్ నిర్వహించారు. కేసు అవసరం లేదంటూ ఒప్పంద పత్రాన్ని ఈ మెయిల్ ద్వారా పంపారు. దీంతో మీడియేషన్ చట్టం 2023 సెక్షన్ 30 ఆధారంగా వారి కేసును పరిష్కరించినట్లు న్యాయాధికారి తెలిపారు. కోర్టు సమస్యల నుంచి సత్వరం బయటపడటానికి మధ్యవర్తిత్వం చక్కటి మార్గమని న్యాయాధికారి రాజశేఖర్ పేర్కొన్నారు.

3న ఎస్కేయూలో వాక్ ఇన్ ఇంటర్వ్యూలు


అనంతపురంరూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యాసంవత్సరానికి వివిధ విభాగాల్లో అకడమిక్ కన్సల్టెంట్ల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఆంజనేయులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. నవంబరు 3న ఉదయం 10గంటలకు సంబంధిత విభాగాల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. బయోటెక్నాలజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, యూఎస్ఐఏఅండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగాల్లో రెండు చొప్పున, బాటనీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, మైక్రోబయాలజీ, పాలిమర్‌సైన్స్, సెరికల్చర్, కామర్స్, హిందీ విభాగాల్లో ఒకటి చొప్పున భర్తీ చేస్తామని అన్నారు. ఆసక్తి గల వారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు జతల జిరాక్స్ కాపీలతో హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు.

ఎస్కేయూలో పలువురి బదిలీ

అనంతపురం రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పలువురు ఉద్యోగులను బదిలీ చేశారు. ఈ మేరకు గురువారం రిజిస్ట్రార్ రమేష్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యూయేషన్‌లో పనిచేస్తున్న సూపరింటెండెంట్ నాగసుధను ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ సెక్షన్‌కు, ఎస్కేయూ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ధర్మయ్యను కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేశారు. జాగ్రఫీ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ప్రతాప్‌రెడ్డిని కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీకి, ఎవాల్యూయేషన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దస్తగిరిని కాలేజ్ ఆఫ్ ఎడ్యుకుషన్‌కు బదిలీ చేశారు. అదే విధంగా కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీలో పనిచేస్తున్న కోదండపాణిని జాగ్రఫీ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేశారు.

ఒక గేటు బంద్


పీఏబీఆర్‌కు తగ్గిపోయిన ఇన్‌ఫ్లో



ఒక గేటు నుంచి విడుదల అవుతున్న నీరు

కూడేరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్(పెన్నోహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) గేటును గురువారం బంద్ చేశారు. రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో ఎక్కువ కావడంతో రెండు గేట్లను ఎత్తిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో తగ్గిపోయింది. దీంతో ఒకగేటు బంద్ చేసి, మరో గేటు ద్వారా 550 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. జల విద్యుత్ కేంద్రంలో ఒక టర్బైన్ ద్వారా 985 క్యూసెక్కుల నీటిని వినియోగించి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ప్రస్తుతం డ్యాంలో 5.329 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా నీరు 140 క్యూసెక్కులు, తుంగభద్ర డ్యాం నుండి లింక్ చానల్ ద్వారా 180 క్యూసెక్కుల నీరు పీఏబీఆర్‌డ్యాంలోకి వస్తుండగా, 1650 క్యూసెక్కుల నీరు ఔట్‌ఫ్లో ఉందని అధికారులు తెలిపారు.

బీటీపీకి తగ్గిన వరద



గుమ్మఘట్ట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బీటీపీ రిజర్వాయర్‌కు గురువారం సాయంత్రానికి వరదనీటి ప్రవాహం తగ్గుముఖం పట్టింది. గత నాలుగు రోజులుగా కర్ణాటక ప్రాంతంలో కురిసిన వర్షాలకు 4400 క్యూసెక్కుల నీటి ప్రవాహం బీటీపీకి చేరుతుండగా నాలుగు గేట్లు ఎత్తి దిగువకు 3600 క్యూసెక్కులు వదిలిన విషయం తెలిసిందే. గురువారం సాయంత్రానికి వరదనీటి ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో రెండుగేట్లు దించి రెండు గేట్ల ద్వారా రెండువేల క్యూసెక్కులు దిగువకు వదిలారు. ఇన్‌ఫ్లో తగ్గడంతో బీటీపీ గేట్లను దించినట్లు ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు. హగరికి రెండువేల క్యూసెక్కులు నీరు వదులుతున్నట్లు వెల్లడించారు.

న్యూస్ బాక్స్

నేడు మంత్రి పర్యటన

ధర్మవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం ధర్మవరంలో పర్యటించనున్నట్టు బీజేపీ నాయకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా పట్టణంలో నిర్వహించే ఐక్యతా యాత్రలో పాల్గొంటారన్నారు. ఈ యాత్ర ప్రధాన కూడలిలో సాగుతుందని, అనంతరం ఎన్డీఏ కార్యాలయంలో మంత్రి అందుబాటులో ఉంటారని తెలిపారు.

ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం

ధర్మవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో రోగులకు యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ఫౌండేషన్ పట్టణ అధ్యక్షుడు శీలానాగేంద్ర మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల నుంచి ఆస్పత్రికి వచ్చే రోగుల సహాయకుల ఇబ్బందులను గమనించి ప్రతి గురువారం దాతల సహకారంతో అన్న దానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ సభ్యులు పీఆర్సీ గుప్త, మోహన్, గర్రె రమేశ్‌బాబు, లోకేశ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై బీజేపీ నాయకుల చొరవ

ధర్మవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గిర్రాజుకాలనీలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు గురువారం పర్యటించారు. కాలనీలోని అనేక సమస్యలను బీజేపీ స్థానిక నాయకులు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఆదేశాలతో హరీశ్‌బాబు కాలనీని సందర్శించారు. ప్రజలతో కలిసి కాలనీలోని ప్రధాన సమస్యలను తెలుసుకున్నారు. వర్షాకాలంలో నిల్వ ఉండటం, దెబ్బతిన్న రహదారులు, డ్రైనేజీ కాల్వలను పరిశీలించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన మున్సిపల్ అధికా రులకు సూచించారు. కాలనీలోని రహదారుల మరమ్మతులు, డ్రైనేజీ ఏర్పాటు, జంగిల్ క్లియరెన్స్ పనులు అత్యవసరంగా ప్రారంభించాలని అధికారులకు తెలిపారు.

పదిలో ఉత్తీర్ణత శాతం పెంచాలి: డీఈఓ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈఓ, ఎంఈఓ

కొత్తచెరువు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గత ఏడాది కంటే ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని డీఈఓ క్రిష్టప్ప ఉపాధ్యాయుల కు సూచించారు. మండలంలోని చెన్నమరాజుపల్లి, బండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలను ఆయన గురువారం పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యాబోధన పై ఆరాతీశారు. ఏవైనా ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకురావాలని డీఈఓ విద్యార్థులకు సూ చించారు. ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2 పరీక్షలలో ఉత్తమ మార్కులను సాధించిన విద్యార్థులను అభినందించారు. మిగిలిన విద్యార్థులు కూడా మంచి మార్కులు సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట ఎంఈఓ జయచంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంజారా హక్కుల కోసం కృషి

● బంజారా సేవా సంఘం నాయకులు

ముదిగుబ్బ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బంజారా హక్కుల కోసం కృషి చేస్తామని అఖిల భారత బంజారా సేవా సంఘం నాయకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముదిగుబ్బ మండలంలో ఎక్కువగా గిరిజన తండాలు ఉన్నాయని, మౌలిక వసతులు లేకపోవడం వల్ల గిరిజనులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరలోనే అన్ని తండాల్లో పర్యటిస్తామన్నారు. సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సేవేనాయక్, మాజీ ప్రిన్సిపాల్ తిరుపాల్ నాయక్, అంజనేయులు నాయక్ తదితరులు ప్రకటనలో పేర్కొన్నారు.

కట్నం వేధింపులపై కేసు

ధర్మవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కట్నం వేధింపులపై ధర్మవరం మండలం చిగిచెర్ల గ్రామానికి చెందిన సాకే కమలమ్మ తన భర్త, అత్తమామలపై ఫిర్యాదు చేసినట్టు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఆయన తెలిపిన మేరకు...చిగిచెర్ల గ్రామానికి చెందిన సాకే కమలమ్మను ధర్మవరం పట్టణం మారుతీనగర్‌కు చెందిన సాకే వెంకటేశ్‌కు ఇచ్చి 2017లో వివాహం చేశారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వెంకటేశ్ డ్రైవర్‌గా పని చేస్తుండగా, కమలమ్మ కూలి పనులకు వెళ్లేది. వివాహం జరిగిన ఏడాది తర్వాత నుంచి వెంకటేశ్ భార్య కమలమ్మతో తరచూ గొడవకు దిగేవాడు. తాగుడుకు బానిసై అప్పులు చేస్తూ, భార్యను అనుమానించేవాడు. పుట్టింటికి వెళ్లి రూ.2లక్షలు తీసుకురావాలని భర్తతోపాటు అత్తమామలు తరచూ మానసికంగా, శారీరకంగా వేధించేవారు. ఈవిషయాన్ని కమలమ్మ తల్లిదండ్రులకు చెప్పగా పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ చేసినా వారిలో మార్పు రాలేదు. దీంతో ఆమె ఈ ఏడాది మార్చిలో పుట్టినిల్లుఅయిన చిగిచెర్లకు పిల్లలతో కలిసి వెళ్లిపోయింది. అయినా వేధింపులు ఆగపోవడంతో గురువారం ఆమె టూటౌన్ పోలీసులకు భర్త, అత్త, మామలపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



వెంకటరమణ (ఫైల్)

అమడగూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపేటకు చెందిన వెంకటరమణ (64) విషద్రావకం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొత్తపేటకు చెందిన వెంకట రమణ కొద్దికాలంగా మద్యానికి బానియ్యాడు. అతడు మద్యం తాగేందుకు భార్యను డ బ్బులు అడగితే ఇవ్వకపోవడంతో మన స్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు బంధువులు, పోలీసులు తెలిపారు. అతడు గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో విషద్రావకం తాగి కొట్టుమిట్టాడుతున్న విషయాన్ని గురువారం సాయంత్రం గమనించిన చుట్టుపక్కల వారు బంధువులకు సమచారం అందించారు. అతడిని 108 వాహనంలో కదిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలప్పగారిపల్లి తండాలో మరొకరు...

కదిరి అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలప్పగారిపల్లి తండాకు చెందిన మూఢే బాలునాయక్ (38) గురువారం ఆత్మహత్య చేసుకున్నట్లు అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ ఏఎస్సై రామకృష్ణ తెలిపారు. బాలప్పగారిపల్లి తండాకు చెందిన మూఢే బాలు నాయక్ వ్యవసాయ చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మూడేళ్ల క్రితం కాలికి గాయమైంది. ఎన్నో ఆసుపత్రుల్లో చూపించినా నయం కాలేదు. దీంతో మనస్థాపం చెంది గురువారం తెల్లవారు జామున తన ఇంట్లో వంట గదిలో చీరతో ఉరి వేసుకున్నాడు. గమనించిన భార్య జుగును బాయి చుట్టుపక్కల వారి సాయంతో పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని కిందికి దించి పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి మేనమామ గోపాల్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

పాముల బెడద

● అపరిశుభ్రంగా పాత పోలీస్ క్వార్టర్స్ ప్రాంతం
● భయాందోళనలో సమీప ప్రాంత నివాసులు



చెట్లు, ముళ్లకంపలతో పాడుపడిన పోలీస్‌క్వార్టర్స్ ప్రాంతం

తనకల్లు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో పాడుబడిన పోలీస్ క్వార్టర్స్ ప్రాంతంలో ముళ్లకంపలు, పిచ్చికంపలు పెరిగి పోవడంతో చుట్టుపక్కల కాపురాలున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడి నుంచి ప్రతిరోజు పాములు బయటకు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట ఇళ్లకు వాకిళ్లు వేసుకొని, బయటకు రాలేని పరిస్థితి ఏర్పడిందని, ఎవరితో చెప్పుకోవాలని వాపోతున్నారు. మండల కేంద్రమైన తనకల్లులో బ్రిటిష్ పాలనా కాలంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. అప్పట్లో పోలీసుల నివాసం కోసం క్వార్టర్స్ నిర్మించారు. కాల క్రమేణా అవి పాడుపడిపోయాయి. అనంతరం పోలీసుల కోసం స్టేషన్ ఆవరణలోనే నూతనంగా క్వార్టర్స్ నియమించారు. ప్రస్తుతం అవి కూడా కూలిపోయే దశలో ఉన్నాయి. అంతేగాకుండా పాడుబడిన పోలీసుల క్వార్టర్స్ చుట్టూ చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. పాత క్వార్టర్స్‌కు ఉన్న రాళ్ల గోడలు కూడా కూలిపోయాయి. దీంతో ఆ ప్రాంతం పాములకు నిలయంగా మారింది. దీంతో పోలీస్ స్టేషన్ పాత క్వార్టర్స్ చుట్టూ కాపురాలు ఉన్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చుట్టుపక్కల కాపురాలు ఉన్న వారు కొంతకాలం క్రితం వరకు పోలీస్ స్టేషన్ ఆవరణం నుంచి మెయిన్ రోడ్డు లోకి నడిచివెళ్లే వాళ్లు. కానీ కొద్దికాలంగా పోలీసులు ఆ ఆవరణం చుట్టూ ముళ్లకంపలు ఏర్పాటు చేయడంతో.. పోలీసు స్టేషన్ ఆవరణంలోకి ఎవరూ అడుగుపెట్టే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో ఆ ప్రాంతమంతా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. కూలిపోయిన గోడలు, పెరిగిపోయిన పిచ్చి మొక్కలతో ఆ ప్రాంతం పాములకు నిలయంగా మారిం దని చుట్టుపక్కల కాపురాలు ఉన్న వారు అంటున్నారు. ప్రతిరోజు ఎవరికో ఒకరికి వివిధ రకాల పాములు కనిపిస్తున్నాయని వారు భయాం దోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాడుబడిన పోలీస్ క్వార్టర్స్‌ను తొలగించి చుట్టూ ప్రహరీ నిర్మించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

చుట్టూ ప్రహరీ నిర్మించాలి



పోలీస్ క్వార్టర్స్ పక్కనే మా ఇల్లు ఉంది. పాడుబడిన క్వార్టర్స్‌లో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. రాళ్లు పడిపోయి, గోడలు కూలిపోవడంతో ఆ ప్రాంతం పాములకు నిలయంగా మారింది. మేము ప్రతిరోజు పాములను చూసి భయపడాల్సి వస్తోంది. పోలీస్‌లు చుట్టూ కంచె ఏర్పాటు చేసుకున్నారు. దీంతో అక్కడ శుభ్రం చేద్దామన్న వీలుకాదు. విష యం ఎవరికి చెప్పుకోవాలో కూడా అర్థం కావడం లేదు. ఉన్నతా ధికారులు స్పందించి పాడుబడిన పోలీస్ క్వార్టర్స్‌ను తొలగించి చుట్టూ ప్రహరీ నిర్మించాలి.

- నాగరాజు, గ్రామస్థుడు

రాత్రిపూట బయటకు రావాలంటే భయం



గతంలో మేమే పోలీస్ స్టేషన్ ఆవరణంలో నుంచి కళాశాలకు, పాఠశాలలకు వెళ్లే వాళ్లం. కొంత కాలం క్రితం పోలీసు ఆవరణం చుట్టూ ముళ్ల కంచె వేశారు. దీంతో పోలీస్ ఆవరణంలోకి అడుగుపెట్టే వీలు లేదు. పాడుబడిన పోలీస్ క్వార్టర్స్ గోడలు కూలిపోయి, క్వార్టర్స్‌లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో ఆ ప్రాంతం పాములకు నిలయంగా మారింది. రాత్రిపూట ఇంట్లో నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నాం. ప్రభుత్వం, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాడుబడిన పోలీస్ క్వార్టర్స్‌ను తొలగించి, చుట్టూ ప్రహరీ నిర్మించాలి.

- రెడ్డి ప్రసాద్, గ్రామస్థుడు

సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం

తనకల్లులో పాడుబడిన పోలీస్ క్వార్టర్స్ నుంచి చుట్టు పక్కల ఇళ్లలోకి పాములు వెళ్తున్న విషయం మా దృష్టికి రాలేదు. ఇప్పుడు విషయం తెలిసింది. సమస్య పరిష్కారానికి పోలీసులతో కలిసి మా వంతు కృషి చేస్తాం.

- కృష్ణమూర్తిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి

ఆ కాలనీలను మున్సిపాలిటీలో చేర్చాలి

● కౌన్సిలర్ల డిమాండ్
● సమావేశాన్ని బహిష్కరించిన అధికారులు



మాట్లాడుతున్న కౌన్సిలర్ సాయికుమార్



సమావేశాన్ని బహిష్కరించి వెళ్తున్న అధికారులు

ధర్మవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని పోతుల నాగేపల్లి, కుణుతూరు, రేగాటిపల్లి కాలనీలను మున్సిపాలిటీలోకి చేర్చాలంటూ కౌన్సిలర్లు మూకుమ్మడిగా అధికారులను డిమాండ్‌చేశారు. సమావేశం ప్రారంభకానికి ముందే సమావేశపు హాల్‌లో ఉన్న కమిషనర్, అధికారులను చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, కౌన్సిలర్లు చైర్‌పర్సన్ చాంబర్‌లోకి పిలిపించుకున్నారు. పోతుల నాగేపల్లి, కుణుతూరు, రేగాటిపల్లి కాలనీలను మున్సిపాలిటీలోకి చేర్చేలా అజెండాలో ఎందుకు పొందుపరచలేదని ఇన్‌చార్జ్ కమిషనర్ సాయికృష్ణను డిమాండ్‌చేశారు. అయితే టౌన్‌ప్లానింగ్ అధికారి ఆఫీసు పనిమీదే నాలుగురోజులు బయటకు వెళ్లారని, తాను ఇన్‌చార్జ్ కమిషనర్‌గా చార్జ్ తీసుకుని నెలరోజులైందని కమిషనర్ తెలిపారు. ఆమె వచ్చాక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేసి చర్చిస్తామని ఆయన సమాధానం చెప్పడంతో కొద్దిసేపు కౌన్సిలర్లు, కమిషనర్ మధ్య వాగ్వాదాలు జరిగాయి. అనంతరం కమిషనర్, అధికారులు కౌన్సిల్ హాల్‌కు వెళ్లారు. పది నిమిషాల తరువాత కౌన్సిలర్లు సమావేశ హాల్‌లోకి వచ్చారు. అజెండాలోని అంశాలను మొదలు పెట్టగానే కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, సాయికుమార్ పైకిలేచి ముందుగా కౌన్సిలర్ల డిమాండ్‌ను అజెండాలో ఎందుకు చేర్చలేదని చర్చకు దిగారు. ఆ కాలనీలను మున్సిపాలిటీలోకి చేర్చాలంటూ నాలుగు నెలలుగా వినతిపత్రాలు అందజేసినా, ఆ అంశాన్ని అజెండాలో ఎందుకు చేర్చలేదని నిలదీశారు. కమిషనర్ కలుగచేసుకుని మీరిచ్చిన వినతిపత్రాన్ని, టీడీపీ నాయకులు ఇచ్చిన వినతిపత్రాన్ని పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఇందుకు చైర్‌పర్సన్ మాట్లాడుతూ... మాటకు విలువలేదని, కమిషనర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అనంతరం అజెండా చదవకనే అందులోని అంశాలను తాము తీర్మానిస్తున్నామని, టేబుల్ అజెండాపై చర్చిద్దామని చైర్‌పర్సన్ తెలుపగా అందుకు కమిషనర్ ఒప్పుకోలేదు. అజెండాలోని అంశాలను ప్రస్తావించకనే టేబుల్ అజెండాపై చర్చించడం మున్సిపల్ నిబంధన లకు విరుద్ధమన్నారు. అయితే టేబుల్ అజెండాను చదవాలని చైర్‌పర్సన్ అనడంతో... తాము నిబంధనలకు విరుద్ధంగా ఏ పనీ చేయమంటూ కమిషనర్, అధికారులు సమావేశాన్ని బహిష్కరించి వెళ్లిపోయారు. దీంతో సమావేశాన్ని మమ అనిపించేశారు. అంతకు మునుపు వైస్ చైర్మన్ జయరామిరెడ్డి మాట్లాడుతూ....కుక్కల ఆపరేషన్ కోసం కౌన్సిల్‌లో రూ.18లక్షలు తీర్మానం చేయించి మంజూరు చేశారని, అయితే ఇంతవరకు ఒక కుక్కకు ఆపరేషన్ చేయలేదని, ఆ వివరాలను తెలపాలని కమిష నర్‌ను అడిగారు. ఈ సమావేశంలో కౌన్సిలర్‌లు, అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ బోర్ల కేబుల్ చోరీ

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మలకవారిపల్లి, పెద్దగుట్ల వారిపల్లిల్లో బుధవారం రాత్రి పలువురు రైతుల వ్యవసాయ పొలాల్లో బోరు మోటార్లకు ఏర్పాటచేసిన కేబుల్ చోరీకి గురైనట్లు బాధిత రైతులు తెలిపారు. పెద్దగుట్టవారిపల్లికి చెందిన వల్లిపి ఆదినారాయణ వ్యవసాయ పొలంలో 98 మీటర్లు, అదేగ్రామానికి చెందిన ప్రభుత్వ తాగునీటి బోరుకు సంబంధించిన 10, మలకవారిపల్లికి చెందిన జీవన్‌రెడ్డి పొలంలో 70, ప్రసాద్‌రెడ్డి పొలంలో 30, మలకప్రతాప్‌రెడ్డి పొలంలో 10 మీటర్లు చొప్పున గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించినట్లు రైతులు తెలిపారు. కేబుల్ చోరీ జరిగిన విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారం

గాండ్లపెంట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కటారుపల్లి పంచాయతీ దోరణాల గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం అయిందంటూ గ్రామస్థులు గురువారం తెలిపారు. దోరణాలలో తాగునీటి బోరు నిత్యం మరమ్మతులకు గురయ్యేది. ఇటీవల దాదాపు నెలరోజుల పాటు మరమ్మతులు చేపట్టక పోవడంతో తాగునీటి సమస్యతో ఇబ్బంది పడ్డారు. దీంతో ఈ నెల 28న స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామస్థులు నిరసన చేపట్టారు. స్పందించిన ఎంపీపీ సోమశేఖరరెడ్డి ఇచ్చిన హామీ మేరకు నూతన బోరు వేయించి, మోటార్ అమర్చడంతో తాగునీటి సమస్య తీరిందని గ్రామస్థులు తెలిపారు.

స్వచ్ఛ భారత్‌పై అవగాహన



గొట్లూరులో శ్రమదానంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

ధర్మవరం రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా రెండోరోజు గురువారం స్వచ్ఛభారత్-పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ గోపాల్ నాయక్ హాజరయ్యారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలో ప్రధాన రహదారిలోని ఆర్చ్ వద్ద నుంచి సచివాలయ ప్రాంగణం, అంబేద్కర్ భవనం, వేణుగోపాల్ స్వామి ఆలయం వరకు చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు తొలగించారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ పిట్టానరసమ్మ, అధ్యాపకులు కిరణ్‌కుమార్, భువనేశ్వరి, పుష్ప, ఆనంద్, సరస్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పట్టని కార్యాలయాలు

● ముళ్ల కంపలు, పిచ్చి మొక్కల మధ్యే నిత్యం విధులు
● ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్న ప్రజలు

నల్లమాడ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణం అపరిశుభ్రతకు నిలయంగా మారింది. మండల స్థాయి కార్యాలయాలన్నీ ఈ ఆవరణంలోనే ఉన్నాయి. దీంతో అన్ని శాఖల అధికారులు ఇక్కడికి రోజూ వచ్చి పోతుంటారు. అదేవిధంగా ప్రతి నెలా మూడో వారం ఉద్యోగులందరూ. కార్యాలయాల పరిసరాలతో పాటు, గ్రామాలలో స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టి, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది. అయితే వారి కార్యాలయాల చుట్టూ ముళ్లకంపలు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి, అందులో నడవడానికి కూడా ఇబ్బందికరంగా ఉంది. ఏ అధికారి పట్టించుకున్న పాపాన పోలేదు. అయితే తరచూ ఎక్కడో ఒక చోట స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పే అధికారులు తమ కార్యాలయాల వద్ద పరిస్థితిని ముందు చక్కదిద్దితే ఆదర్శంగా ఉంటుంది కదా అని ప్రజలు మాట్లాడుకుంటున్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలోనే ఎమ్మార్సీ, హౌసింగ్, ఉపాధి హామీ, రైతు సేవా కేంద్రం, వెలుగు, వ్యవసాయం కార్యాలయాలు, రెండు గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఈ కార్యాలయాల వెనుక భాగంలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి అడవిని తలపిస్తున్నాయి. అందులో పగటి పూటే పాములు తిరుగుతుండడం అధికారులే చాలా సార్లు చూశారు. కానీ ఆ పిచ్చి మొక్కలను తొలగించే ప్రయత్నం ఎవరూ చేయలేదు. ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించే ప్రయత్నం చేయకపోవడం శోచనీయమని ప్రజలంటున్నారు. చీకటి పడ్డాక ఆ ఆవరణంలోకి వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆవరణను శుభ్రంగా ఉంచుకోవాలని కోరుతున్నారు.



ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలోకి వెళ్లేందుకు ముళ్లకంపల మధ్యలో దారి



ముళ్ల కంపల మధ్యలోనే కార్యాలయాలు

కలసికట్టుగా అభివృద్ధి చేద్దాం

● మార్కెట్ యార్డ్ కమిటీతో మాజీ మంత్రి పల్లె



మార్కెట్‌యార్డ్‌ను పరిశీలిస్తున్న మాజీ మంత్రి పల్లె, చైర్మన్ పూలశివ

కొత్తచెరువు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్‌యార్డ్ అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మార్కెట్‌యార్డ్ చైర్మన్, డైరెక్టర్లకు సూచించారు. మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డ్‌లో తొలిసారిగా నూతన కమిటీ సమావేశాన్ని చైర్మన్ పూలశివప్రసాద్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. మాజీ మంత్రి పల్లె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గొర్ల సంత ద్వారా వచ్చే ఆదాయంతో గొర్రెలకు తాగునీటి ట్యాంకులు, విద్యుత్ సౌకర్యం, షెడ్లను ఏర్పాటుచేయాలన్నారు. పాత షెడ్లకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. గోదాములు, ప్రహరీకి మరమ్మతులతో పాటు పేయింట్, షెట్టర్లను వే యించాలన్నారు. ధర్మవరం ప్రధాన రహదారి నుంచి మార్కెట్‌యార్డ్ ఆవరణంలోకి తారురోడ్డు, నూతన కార్యాలయం నిర్మించాలని ఆయన సూచించారు. ఇందుకోసం సీఎం చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నానాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో చర్చించి నిధుల మంజూరుకు కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఒలిపిశీన, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోరంట్లపల్లిశీన, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్లు నిజాంవలి, జయశ్రీ, జ్యోతి ప్రసాద్, నంజప్ప, హేమావతి సుధీర్, సురేశ్, మస్తానమ్మ, ప్రవీణ, గోపీనాథరెడ్డి, కిలారి శ్రీనాథ్, నాగరత్న, సిబ్బంది పాల్గొన్నారు.

అసెంబ్లీకి ఆరుగురు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థిని నిషితను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తచెరువు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు చట్టసభలలో వ్యవహరించే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండల, డివిజన్, నియోజకవర్గ స్థాయిలో 8,9,10 తరగతి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు నవంబరు 26న అమరావతిలో జరిగే రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొంటారని డీఈఓ క్రిష్టప్ప, ఎంఈఓ జయచంద్ర తెలిపారు. ఇందులో మడకశిర నియోజకవర్గం నుంచి హరేసముద్రం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి శిరీష, పెనుకొండ నియోజకవర్గంలోని రొద్దం మండలం కొగిరి పాఠశాలకు చెందిన కె. జయవర్ధన్, హిందూపురం నియోజకవర్గం లేపాక్షి మండలం పూలమతి గ్రామ పాఠశాలలో పదో తరగతి విద్యార్థి జి.మేఘన, పుట్టపర్తి నియోజకవ ర్గం కొత్తచెరువు మండలం తలమర్ల పాఠశాల విద్యార్థిని జి.నిషిత, కదిరి నియోజకవర్గం ఎన్‌పీకుంట పాఠశాలకు చెందిన ఆర్.వైష్ణవి, ధర్మవరం ని యోజకవర్గం బీఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాల లో తొమ్మిదో తరగతి విద్యార్థి జశ్వంత్ ఎంపిక య్యారని డీఈఓ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా ర్థులకు ఇలాంటి అవకాశం కల్పిస్తుండటం ఎం తో గొప్ప విషయమని డీఈఓ పేర్కొన్నారు.



వైష్ణవిని అభినందిస్తున్న ఎంఈఓలు

కొనసాగిన డివిజన్ స్థాయి క్రీడా పోటీలు



కబడ్డీ ఆడుతున్న బాలుర జట్లు

కదిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కొనసాగిన డివిజన్ స్థాయి పోటీలను రెండో రోజు గురువారం ఎంఈఓలు చెన్నకృష్ణ, ఓబులరెడ్డి ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయురాలు స్వరూప అధ్యక్షత వహించారు. అండర్-14, 17 బాలికల ఖోఖో విన్నర్స్‌గా గాండ్లపెంట మండలం, రన్నర్స్‌గా కదిరి మండలం జట్లు నిలిచాయి. అండర్ -14, 17 బాలుర ఖోఖో విన్నర్స్‌గా గాండ్లపెంట మండలం జట్లు, అండర్ -14 రన్నర్‌గా తనకల్లు మండలం, అండర్-17 రన్నర్‌గా కదిరి మండలం జట్టు నిలిచాయి. అండర్-14 బాలురు కబడ్డీ పోటీలో విన్నర్స్ కదిరి, రన్నర్స్ ఎన్‌పీకుంట. అండర్ - 17 బాలుర కబాడ్డీలో విన్నర్స్‌గా నల్లచెరువు, రన్నర్స్‌గా కదిరి జట్లు సాధించాయి. అండర్ -14 బాలికల కబడ్డీ విభాగంలో విన్నర్స్‌గా తలుపుల, రన్నర్స్‌గా కదిరి, అండర్ -17లో విన్నర్ ఎన్‌పీకుంట, రన్నర్‌గా నల్లచెరువు జట్లు సాధించాయి. అండర్ -14 వాలీబాల్ బాలుర విభాగంలో విన్నర్స్‌గా తనకల్లు, రన్నర్స్‌గా కదిరి, అండర్ -14 బాలికల విభాగంలో విన్నర్స్‌గా కదిరి, రన్నర్స్‌గా తలుపుల మండల జట్లు గెలుపొందినట్లు డివిజన్ కోఆర్డినేటర్ లష్కర్‌నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటాచలం, ఏజీఎఫ్ సెక్రటరీ సుహాసిని, పీడీలు శంకర్‌నాయక్, హరిప్రసాద్ నా యక్, రవీంద్రనాయక్, యశోద, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు కోసం రోడ్డెక్కి ఆందోళన



హైవేపై బైఠాయించిన మహమ్మదా బాద్ క్రాస్ వాసులు

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోకి బస్సులు రావడంలేదని... దీంతో వృద్ధులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండలపరిధిలోని మహమ్మదా బాద్ క్రాస్ పరిసర ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామానికి ఆర్టీసీ బస్సులు నడపాలంటూ గురువారం కదిరి - హిందూపురం హైవేపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత వాసులు బోణాల రామాంజి, మెకానిక్ శ్రీరాములు, వెంకటేష్, విశ్వనాథరెడ్డి, రమణ, సూరి, కె.మురళి మాట్లాడుతూ... హైవే నిర్మాణం జరిగిప్పటి నుంచి తమ గ్రామంలోకి ఒక్క బస్సు కూడా రావడం లేదన్నారు. హైవేపైన డివైడర్‌లు క్లోజ్ చేశారని, వాటిని ఓపెన్ చేస్తే తప్ప బస్సులు గ్రామం లోపలికి రావడం కుదదరని బస్సు డ్రైవర్లు తెలిపారన్నారు. ఈ విషయాన్ని గతంలో ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. గంట పాటు రోడ్డుపై గ్రామస్థులు నిరసన తెలపడంతో పదుల సంఖ్యలో వాహనాలు హైవేపై నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి 15 రోజులలో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.

పెంకుల షెడ్డులో విద్యాబోధన

వర్షం వస్తే జలమయం

నాడు-నేడుకు ఎంపికైనా మారని రూపురేఖలు

రెండోవిడత విడుదల కాని నిధులు

అర్ధాంతరంగా ఆగిన పనులు

ఇదీ రామనపల్లి ప్రాథమిక పాఠశాల పరిస్థితి



అర్ధాంతరంగా ఆగిన పనులు



పెంకుల షెడ్డు

అగళి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామనపల్లి ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. ఈ పాఠశాలకు సంబంధించి ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. 24 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో అప్పటి వైసీపీ హయాంలో నాడు-నేడు పథకం కింద పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి రూ. 20 లక్షల నిధులు మంజూరయ్యాయి. రూ. 10 లక్షలు విడుదలయ్యాయి. పనులు ప్రారంభమయ్యాయి. అయితే పనులు అరకొరగానే జరిగాయి. అర్ధాంతరంగా ఆగిపోయాయి. బాత్‌రూంలను నిర్మించారు. కాంపౌండ్‌వాల్ నిర్మాణాన్ని ప్రారంభించారు. రెండో విడత నిధులు మంజూరుకాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. పాఠశాలకు సంబంధించి రెండు పెంకుల షెడ్లు ఉన్నాయి. ఈ భవనాల రూపురేఖలు మాత్రం మారలేదు. వీటిలోనే ప్రస్తుతం విద్యార్థులకు బోధన సాగుతోంది. వర్షం వస్తే పెంకుషెడ్లలో నీరు నిల్వ ఉంటోంది. కిటికీలు, తలుపులు లేవు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తాం

రెండో విడత నాడు-నేడు కింద పాఠశాలను ఎంపిక చేశారు. అప్పటి ప్రభుత్వం రూ. 20 లక్షలు కేటాయించింది. రూ.10లక్షలు నిధులు మంజూరుకావడంతో పనులు జరిగాయి. మిగిలిన నిధులు విడుదల కాకపోవడంతో పనులు ఆగిపోయాయి. నిధులు వచ్చిన వెంటనే పనులు చేపడతాం.

-నూర్జహన్, ప్రధానోపాధ్యాయురాలు

అధికారులు నిజాయతీగా పనిచేయాలి

● ఎంపీ బీకే పార్థసారథి



మాట్లాడుతున్న ఎంపీ బీకే పార్థసారథి

పెనుకొండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అధికారులు నిజాయతీతో పనిచేస్తేనే అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయగలుగుతామని హిందూపురం పార్లమెంట్ సభ్యులు బీకే పార్థసారథి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం పెనుకొండలోని ఎంపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన తహసీల్దార్‌లు, గృహనిర్మాణశాఖాధికారులతో ప్రధాని ఆవాజ్‌యోజన గృహనిర్మాణంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి త్వరితగతిన ఇంటిపట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లు అందజేయాలన్నారు. ఈ విషయంలో అధికారులు ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా నిజాయితీగా వ్యవహరించాలన్నారు.

గెలుపు, ఓటములను క్రీడాస్ఫూర్తితో తీసుకోవాలి: ఎంపీ

పెనుకొండ, (ఆంధ్రజ్యోతి): క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని వాటిని క్రీడా స్ఫూర్తితో తీసుకోవాలని ఎంపీ బీకే పార్థసారథి సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ క్రీడా మైదానంలో డివిజన్‌స్థాయి స్కూల్‌గేమ్స్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ పోటీలకు డివిజన్‌లోని 12మండలాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమ ముగింపు సమావేశానికి ఎంపీ బీకే పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో డీవైఈఓ జాన్‌రెడ్డప్ప, హెచ్ఎం రాఘవయ్య, ఎంఈఓ సుధాకర్, నాగార్జున, ఎస్‌సిఎఫ్ కార్యదర్శి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

హిందూపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కిరికెర, బసవనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్యాధికారి ఫైరోజ్‌బేగం గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్యంపై ఆరాతీశారు. జబ్బులకు తగ్గట్టు మందులు ఆసుపత్రిలో ఉన్నాయా..? లేదా..? తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

వైసీపీది అసత్య ప్రచారం: ఎమ్మెల్యే



మడకశిర టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత ను తాను అవమానించినట్లు వైసీపీ అసత్య ప్రచారం చేస్తోందని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం వలన దళితుల జీవితాలు, జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని వ్యాఖ్యానించానే కానీ తాను హిందువుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడలేదన్నారు. తుఫాను బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న సేవల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే వైసీపీ డైవర్షన్ కుట్రలకు తెరతీసిందన్నారు. తాను దళిత హిందువునని, కరుణాకర్‌రెడ్డి లాగ ఇంట్లో ఒక మతం, పదవుల కోసం బయట మరోమతం ఆచరించే వ్యక్తిని కాదన్నారు. ఇలాంటి అసత్య ప్రచారాలు, కుట్రలకు భయపడబోనన్నారు.

వరల్డ్ కల్చరల్ ఫెస్టివల్‌లో గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం చిక్కబళ్లాపురంలో గురువారం జరిగిన వరల్డ్ కల్చరల్ ఫెస్టివల్ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. కేంద్ర సహాయ జలవనరుల, రైల్వే శాఖ మంత్రి సోమన్నతో మడకశిరకు సంబంధించి త్వరితగతిన రైల్వేలైన్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని పలు అంశాలపై చర్చించారు. కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని, ఇటీవల తమ దృష్టికి వచ్చిన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని గుండుమల తిప్పేస్వామి తెలిపారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

చిలమత్తూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ వచ్చిందని మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని శెట్టిపల్లి పంచాయతీ కమ్మయ్యగారిపల్లి నుంచి బెంగళూరు-గోరంట్ల జాతీయ రహదారిలోకి కలుపుతూ నూతన రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ. 75 లక్షల నిధులు మంజూరు చేసింది. గురువారం మండల టీడీపీ నాయకులు రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క గ్రామానికి కూడా రోడ్డు నిర్మాణాలు జరగలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణమూర్తి పాల్గొన్నారు.

సమస్యలపై రాజీలేని పోరాటం

యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కన్వీనర్ మహంతి

పరిగి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు చేస్తున్నామని జిల్లా ఆడిట్ కన్వీనర్ మహంతి అన్నారు. యూటీఎఫ్ పరిగి మండల అధ్యక్షుడి ఎంపిక గురువారం కొడిగెనహళ్లి పాఠశాలలో జరిగింది. బాబాఫక్రుద్దీన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహంతి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఏ సమస్య ఎదురైనా పరిష్కారానికి యూటీఎఫ్ ముందుంటుందన్నారు. పీఆర్‌సీ, ఐఆర్, పీఎఫ్ తదితర వాటిపై రాజీలేని పోరాటం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం కృపాసత్యరాజ్, లక్ష్మీపతి, పద్మావతి, శ్రీనివాసులు, శంకర్‌నాయక్, అశ్వర్థనారాయణ, రంగనాథ్, యూటీఎఫ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డ్ చైర్మన్‌కు గాయాలు

పెనుకొండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పెనుకొండ సమీపంలోని రొద్దంపేట్లపై ద్విచక్రవాహనం బోల్తాపడి మార్కెట్‌యార్డ్ చైర్మన్ బొక్సంపల్లి రామకృష్ణప్పకు తీవ్రగాయాలయ్యాయి. బొక్సంపల్లి గ్రామానికి చెందిన రామకృష్ణప్ప పని నిమిత్తం పెనుకొండకు వెళుతున్నాడు. రొద్దం పేట్లవద్దకు రాగానే టైరుపగిలి ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తాపడింది. హుటాహుటిన అతడిని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న కూటమి నాయకులు ఆసుపత్రికి చేరుకుని పరామర్శించారు.

'నిధులు అందించి ఆదుకోండి'

పావగడ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తాలూకా వ్యాప్తంగా 1973 నుంచి నివృత్తి పొందిన అంగన్‌వాడీ టీచర్లకు గ్రాచ్యుటీ అందించాలని రిటైర్డ్ అంగన్‌వాడీ టీచర్లు సీడీపీఓ సునీతకు గురువారం వినతిపత్రం అందించారు. కర్ణాటక సీఎం సిద్దరామయ్య చొరవ తీసుకుని నిధులు అందించి కోరారు. అనంతరం వినతిపత్రాన్ని సీడీపీఓకు అందజేశారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

పావగడ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కొరటగెర తాలూకాలో జరిగిన జిల్లాస్థాయి ఉన్నత పాఠశాల విద్యార్థుల క్రీడా పోటీల్లో వెంకటేశ్వర ఇంగ్లీష్ మీడియా హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ట్రిపుల్‌జంప్‌లో యుక్తి మొదటిస్థానం, 100మీటర్ల పరుగు పందెంలో శ్రావణి ద్వితీయస్థానంలో నిలిచారన్నారు. ట్రిపుల్‌జంప్‌లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రెండోస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని పీడీ, ఉపాధ్యాయులు వినోద్, సురేష్, రామ్ అభినందించారు.

అభివృద్ధికి సహకరించండి

కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ చైర్మన్



మాట్లాడుతున్న చైర్మన్ రమేష్

హిందూపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): హిందూపురం పట్టణం అభివృద్ధి చేయడం కోసం కౌన్సిలర్లు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ రమేష్ కోరారు. గురువారం చైర్మన్ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పట్టణాభివృద్ధికోసం ఎంతగానో కృషిచేస్తున్నారని ఇందులో బాగంగా పట్టణంలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం రూ.92.5కోట్లు నిధులకు టెండర్లు ప్రక్రియ పూర్తయిందన్నారు. వైసీపీకి చెందిన వైస్ చైర్మన్ బలరాంరెడ్డి, కౌన్సిలర్ ఆసిఫ్ మాట్లాడుతూ హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో మిగతా పట్టణాలతో పోల్చితే హిందూపురం పెద్ద పట్టణమని జిల్లా కేంద్రానికి అన్ని సౌకర్యాలు ఇక్కడ ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రం చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ సభ్యులు మద్దతు తెలుపకపోవడంతో వైసీపీ సభ్యులు మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జిల్లా కేంద్రం చేస్తామని అధికారంలోకి వస్తే హిందూపురాన్ని జిల్లాగా ప్రకటిస్తామన్నారు. ఆ హామీని నిలబెట్టుకోవాలన్నారు. చైర్మన్ రమేష్ మాట్లాడుతూ జిల్లా కేంద్రం ఏర్పాటు విషయంపై ఎమ్మెల్యే ఒకేమాటపై ఉన్నారని అయితే వారం రోజుల్లో దీనిపై చర్చించి ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి స్పష్టత ఇస్తామన్నారు. అనంతరం అజెండాలోని 19 అంశాలను ఆమోదించారు. కార్యక్రమంలో కమిషనర్ మల్లికార్జున, ఎంఈ దస్తగిరి, డీఈ వాణి తదితరులు పాల్గొన్నారు.

సూగూరు ఆలయ కమిటీ చైర్మన్‌గా చంద్రశేఖర్



చంద్రశేఖర్

హిందూపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): హిందూపురంలో పేరుగాంచిన ప్రముఖ సూగూరు ఆంజనేయస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా వైసీ చంద్రశేఖర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆలయ కమిటీ సభ్యులుగా మురళిధర్ రామక్రిష్టప్ప, అశ్వర్థమ్మ, వరలక్ష్మీ, అనూష, చైతన్య సుగుణ, కృష్ణలను ఎంపిక చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది.

నేరాలకు దూరంగా ఉండాలి: సీఐ

చిలమత్తూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నేరాలకు దూరంగా ఉంటూ ప్రశాంత జీవనం కొనసాగించాలని హిందూపురం రూరల్ సీఐ జనార్దన్ సూచించారు. గురువారం ఆయన మండలంలోని పాతచామలపల్లి గ్రామంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన తన సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. అనంతరం సమావేశం ఏర్పాటుచేశారు. నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని, పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ పౌరులకు రాజ్యాంగం ప్రత్యేక హక్కులు, రక్షణ కల్పించిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ జగన్నాథం తదితరులు పాల్గొన్నారు

లేపాక్షి, (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ హక్కులను తెలుసుకోవాలని తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ అన్నారు. గురువారం చౌళసముద్రం ఎస్సీకాలనీలో పౌరహక్కుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుల మత బేధాలకు దూరంగా ఉండాలని ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి ప్రశాంతంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహమూర్తి, ఎంఈఓ నాగరాజునాయక్, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

లో వోల్టేజీ సమస్యకు పరిష్కారం

అమరాపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దేవగానపల్లి గ్రామ ఎస్సీకాలనీలో ఎట్టకేలకు లోవోల్టేజీ సమస్య తీరింది. ఎస్సీ కాలనీలో లోవోల్టేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి దృష్టికి తీసుకెళ్లగా ట్రాన్స్‌కో అధికారి సిద్దేశ్వరతో సమస్యను పరిష్కరించాలని వారు ఆదేశించారు. గురువారం 16కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చి సమస్య పరిష్కరించారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి

వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ

సోమందేపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలంటూ గురువారం కొత్తపల్లి క్రాస్‌వద్ద వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ స్థానిక నాయకులతో కలిసి కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీపీపీ విధానాన్ని రద్దుచేసి ప్రభుత్వమే మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి సవిత మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై పోరాడాలన్నారు. తమ ప్రభుత్వ హయాంలో అనేక సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల పరిశీలన

సోమందేపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గోరంట్ల మండల కేంద్రంలో పదోతరగతి పరీక్షా కేంద్రాలను గురువారం అసిస్టెంట్ కమిషనర్ ఎగ్జామినేషన్ లాజర్, డీవైఈఓ జాన్‌రెడ్డప్పలు పరిశీలించారు. 2024-25కు సంబంధించి పరీక్షలు నిర్వహించేందుకు జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, న్యూమాంటిస్సోరి పాఠశాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో వసతులు, గాలి, వెలుగుతురు, ఫ్యాన్‌లు, టాయ్‌లెట్‌లు సౌకర్యంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పరీక్షా కేంద్రం వద్ద అధికారులు

ద్విచక్రవాహనం చోరీ

సోమందేపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇందిరానగర్‌లో ఇంటి బయట పార్కుచేసిన పల్సర్ బైక్ చోరీకి గురైనట్లు బాధితుడు చాంప్ తెలిపాడు. కియాలో విధులు ముగించుకుని బుధవారం రాత్రి ఇంటిబయట తాళం వేసి ఉంచి నిద్రపోయానన్నారు. గురువారం ఉదయం లేచి చూస్తే బండి చోరీకి గురైనట్లు గుర్తించానన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి

పెనుకొండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించాలని ఎస్‌బీఐ మేనేజర్ మహేష్ సూచించారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాలప్రాంగణంలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భంగా మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ సుదర్శన్, మేనేజర్ మహేష్, అధ్యాపకులు ప్రాంగణంలో మొక్కలునాటి నీరు పోశారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో... స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీకళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం మూడోరోజు చెరువు రోడ్డులో ఇళ్లవద్ద మొక్క లు నాటే కార్యక్రమం చేట్టారు. కార్యక్రమంలో కమిషనర్ సతీష్‌కుమార్, పీఓ ప్రతాప్ పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీకి ఎంపిక



జయవర్ధన్

పెనుకొండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి మాక్ అసెంబ్లీకి పెనుకొండ ప్రభుత్వ బాలుర పాఠశాలలో చదువుతున్న కోగిర విద్యార్థి జయవర్ధన్ ఎంపికైనట్లు హెచ్ఎం రాఘవయ్య తెలిపారు. విద్యార్థిని డీవైఈఓ జాన్‌రెడ్డప్ప, ఎంఈఓ సుధాకర్ తదితరులు అభినందించారు.

సౌకర్యాలు ఎలా ఉన్నాయ్..?

హాస్టల్ విద్యార్థుల వద్ద ఆరా తీసిన న్యాయాధికారి అశోక్‌కుమార్



విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయాధికారి అశోక్‌కుమార్

మడకశిర టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో సౌకర్యాలు ఎలా ఉన్నాయని మడకశిర జూనియర్ సివిల్ న్యాయాధికారి అశోక్‌కుమార్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గురువారం సాయంత్రం ఆయన ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్‌ను తనిఖీచేశారు. అక్కడ విద్యార్థులతో సౌకర్యాలపై ఆరాతీశారు. అనంతరం హాస్టల్ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు.

మెరుగైన ఫలితాలకు కృషిచేయండి: ఎంఈఓ

రొళ్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో మెరుగైన ఫలితాలకు కృషి చేయాలని ఎంఈఓ శ్రీధర్ సూచించారు. కాకి ఉన్నత పాఠశాలను ఆయన గురువారం తనిఖీచేశారు. విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పదవతరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధంచేయాలన్నారు. ఆయన వెంట హెచ్ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

చిత్రలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

గుడిబండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాయణ హట్టి గ్రామంలో వెలిసిన చిత్రలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం స్వామివారికి ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి పాలుపోసి మొక్కుబడులు తీర్చుకున్నారు.

ఎలుగుబంటి దాడిలో తీవ్ర గాయాలు

పావగడ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తాలూకా పరిధిలోని కరియమ్మనపాళ్య గ్రామానికి చెందిన రైతు ఈరన్నపై గురువారం ఉదయం 6 గంటల సమయంలో ఎలుగుబంటి దాడిచేసి గాయపరిచింది. పొలానికి వెళ్తున్న సందర్భంలో దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కేకలు వేయడంతో గ్రామస్థులు అక్కడకు చేరుకోగా ఎలుగుబంటి పారిపోయింది. రైతును పావగడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం తుమకూరుకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఆహారం కోసం గ్రామ సరిహద్దులోకి వన్యప్రాణులు వస్తున్నాయని, గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు రాకేష్, బసవరాజ్ సూచించారు.

అవినీతి రహిత సమాజమే లక్ష్యం

● ఏసీబీ ఇన్‌స్పెక్టర్ హమీద్‌ఖాన్

హిందూపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని ఏసీబీ ఇన్‌స్పెక్టర్ హమీద్‌ఖాన్ అన్నారు. గురువారం హిందూపురంలో విజిలెన్స్ అవేర్నెస్ వారోత్సవాల్లో భాగంగా ఎంజీఎం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ అవినీతి రహిత సమాజం కోసం కృషిచేయాలన్నారు. విద్యార్థి దశనుంచే లంచగొండి తనాన్ని వ్యతిరేకించడం అలవాటు చేసుకుంటే భవిష్యత్తులో లంచం లేని సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు లంచానికి పాల్పడుతుంటే 1064నంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. 'అవినీతి రహిత సమాజం కోసం' నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఎవరైనా లంచం అడిగితే 9491305616 నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు.

'అవినీతి అంతం.. సామాజిక లక్ష్యం కావాలి'

పెనుకొండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అవినీతి నిర్మూలనే సామాజిక లక్ష్యం కావాలని పరిటాల శ్రీరాములు డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ జయప్ప పేర్కొన్నారు. గురువారం స్థానిక కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్, కామర్స్ విభాగం ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జయప్ప మాట్లాడుతూ అవినీతిని సాధ్యమైన మేరకు తొలగించడానికి ప్రయత్నించినప్పుడే ఆయా రంగాల ఫలాలు ప్రజలకు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఐక్యూ కోఆర్డినేటర్ యశోద రాణి, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ కాంతరావు, చంద్రమోహన్, రామన్న తదితరులు పాల్గొన్నారు.